# కలం నిఘా

WWW.KALAMNIGHA.COM

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ గురువారం 5 జూన్ 2025

సంపుటి: 15, సంచిక: 60, పేజీలు 8, వెల: 4.00

Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam


## రాష్ట్రపతి భవన్‌లో.... విశిష్ట సేవా పతకాల ప్రదానోత్సవం

న్యూఢిల్లీ జూన్ 4 (నిఘా న్యూస్)



ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్లో త్రివిధ దళాలకు విశిష్ట సేవా పతకాల ప్రదానోత్సవం జరిగింది. త్రివిధ దళాలలో అత్యుత్తమ సేవలందించిన పలువురు సైన్యాధికారులు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా విశిష్ట సేవా పతకాలు అందుకున్నారు.




తెలంగాణలో ఏడుగురు

## సీనియర్ ఐపీఎస్ అధికారుల బదిలీలు

ఉత్తర్వులు జారీ

2లో..

# రాజకీయ ముసుగులో..
# జగన్ నేరాలు

**నన్ను జైల్లో పెట్టారని జగన్‌ను జైల్లో పెట్టడం ధర్మం కాదు కదా: చంద్రబాబు**

జగన్‌లా కక్ష సాధింపు రాజకీయాలు సరికాదు

నేరం రుజువైతే జైలు జీవితం ఎవరికైనా తప్పదు

ఒకప్పుడు నేరస్తులను కలవాలంటే నేతలు భయ పడేవారు

ఇప్పుడు నేరస్థులతో రాజకీయాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది

గత ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై పారదర్శకంగా విచారణ

కేబినేట్ భేటీలో మంత్రులతో సీఎం చంద్రబాబు



అమరావతి జూన్ 4 (నిఘా న్యూస్)

ఒకప్పుడు నేరస్థుల్ని రాజకీయ నాయకులు కలవాలంటేనే భయపడేవారన్న చంద్రబాబు. ఇప్పుడు నేరస్థుల్ని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. నేరస్థులకు తాము అండగా ఉన్నామని ప్రజలకు సందేశమిస్తూ రాజకీయాల్ని ఎటు తీసుకుపోతున్నారో అర్థం కావట్లేదని దుయ్యబట్టారు. తప్పు చేసిన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. ఈ మేరకు కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. తనను జైల్లో పెట్టారని జగన్‌ను కూడా జైలులో పెడతామంటే ఎలా కుదురుతుంది. అది కరెక్ట్ కాదు కదా అని మంత్రులతో సీఎం అన్నారు. బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 'జగన్ తప్పు చేశాడు కదా మనం ఎందుకు చర్యలు తీసుకోకూడదని మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రశ్నించగా అతను తప్పులు చేసినట్లు రుజువులు ఉంటే చట్టానికి దొరికితే మనం చర్యలు తీసుకోవాలి. మంత్రులు చాలా జాగ్రత్తగా ..మిగతా 2లో



విక్టరీ పరేడ్ తొక్కిసలాటలో

## 11 మంది మృతి

తొలిసారి ఐపీఎల్ ట్రోఫీ అందుకున్న ఆర్సీబీ టీమ్

చిన్నస్వామి స్టేడియంలో విజయోత్సవాలు

హాజరైన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, గవర్నర్ ఇతర మంత్రులు

బెంగుళూరు జూన్ 4 (నిఘా న్యూస్)

బెంగళూరులో ఆర్సీబీ విజయోత్సవాల్లో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో 11 మంది మృతి చెందారు. పదుల సంఖ్యలో అభిమానులకు తీవ్ర గాయాల పాలయ్యారు. 18 ఏళ్ల తర్వాత తొలిసారి ఐపీఎల్ ట్రోఫీ అందుకున్న ఆర్సీబీ టీమ్‌ను, చిన్నస్వామి స్టేడియంలో విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆర్సీబీ ఆటగాళ్లను చూసేందుకు అభిమానులు భారీగా ఎగబడటంతో తొక్కిసలాట జరిగింది. భారీగా తరలివచ్చిన ఆర్సీబీ ఫ్యాన్స్‌ను అదుపు చేయడంలో పోలీసులు చేతులెత్తేయ డంతో పరిస్థితి మరింత దారుణంగా ..మిగతా 2లో



## నేడే కేబినెట్ మీటింగ్

కీలక అంశాలపై చర్చ

సీఎం అధ్యక్షతన మీటింగ్.. పలు కీలక అంశాలపై చర్చించనున్న మంత్రులు

యువవికాసం లబ్ధిదారుల ఎంపికపై చర్చ

రైతు భరోసాపై సమీక్షించనున్న కేబినెట్

హైదరాబాద్ జూన్ 4 (నిఘా న్యూస్)

పలు కీలక అంశాలపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ జరగనుంది. రాజీవ్ యువ వికాసం, ..మిగతా 2లో



మెంటల్ ఆసుపత్రి ఘటనపై

## మంత్రి ఆరా

హైదరాబాద్ జూన్ 4 (నిఘా న్యూస్)

తెలంగాణ అవతరణ దినోత్సవం రోజు ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో చోటు చేసుకున్న ఫుడ్ పాయిజన్ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూన్ 2న జరిగిన ఈ ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ స్పందించారు. మొత్తం 92 మంది రోగులు అస్వస్థతకు గురవగా, వారిలో 18 మందిని తీవ్రంగా ఉండటంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారిని గాంధీ ఆసుపత్రి, ..మిగతా 2లో



బనకచర్లకు

## కేంద్రం సానుకూలం

ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమీకరణకు కేంద్రం సహకారం

ఏడాది పాలనలో అంతా బాగా పని చేశారు

సమస్యలపరిష్కారమే ఎజెండగా ముందుకు సాగాలి

15న తిరుపతిలో సినిమా సెలబ్రిటీలతో యోగా

సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు ఆమోదం

కేబినేట్ నిర్ణయాలను వెల్లడిరచిన మంత్రి పార్థసారథి

అమరావతి జూన్ 4 (నిఘా న్యూస్)

ఏడాది పరిపాలన అంతా బాగుందని, మంత్రులు మరింత సమర్థంగా పనిచేయాలని సిఎం చంద్రబాబు నాయుడు సూచించారు. ప్రజాసమస్యల పరిష్కారమే అజెండా కావాలని పిలుపునిచ్చారు. మరింత దూకుడు పెంచి ప్రజల్లో మమేకం కావాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. పోలవరం-బనకచర్లపై కేంద్రం నుంచి సానుకూల స్పందన వస్తోందని, ప్రాజెక్టుకు నిధుల సమీకరణ జరుగుతోందని సీఎం తెలిపారు. ఈ ఏడాది మంత్రులు బాగా పనిచేశారని, ఇంకా కష్టపడాలని ఈ ఏడాది ఏం చేశారనేది ఒకసారి సమీక్ష చేసుకోవాలని ..మిగతా 2లో

మేఘా కృష్ణారెడ్డికి....

# నోటీసులు ఇచ్చే దమ్ముందా!




బనకచర్లను అడ్డుకొని కాళేశ్వరానికి జాతీయ హెూదా తెప్పించే బాధ్యత ఈటల తీసుకోవాలి

కాళేశ్వరంలో 15 పంప్ హౌస్‌లు కట్టిన కృష్ణారెడ్డి

రాజకీయ దురుద్దేశంతో కేసీఆర్‌కు నోటీసులు

ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో కవిత

హైదరాబాద్ జూన్ 4 (నిఘా న్యూస్)

రాజకీయ దురుద్దేశంతో కేసీఆర్‌కు నోటీసులు జారీ చేశారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే, మొత్తం తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్లేనని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో తెలంగాణ జాగృతి హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించింది. ధర్నాలో కవిత పాల్గొని మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ కాదు, అది కాంగ్రెస్ కమిషన్, రాజకీయ కమిషన్ కాళేశ్వరం అంటూ విమర్శించారు. ప్రాజెక్టు పూర్తయితే 35 శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు అందిస్తుందన్నారు. 40 టీఎంసీలతో హైదరాబాద్‌కు శాశ్వతంగా నీళ్లు ఇచ్చే ప్రాజెక్టు కాళేశ్వరమని మన పరిశ్రమలకు 16 టీఎంసీల నీళ్లు అందించే ప్రాజెక్టు కాళేశ్వరమని. 90 మీటర్ల అడుగున ఉండే నీళ్లను 600 ..మిగతా 2లో




వచ్చే ఏడు దేశంలో

## కుల గణన

2026 అక్టోబర్ ఒకటి నుంచి దేశ వ్యాప్తంగా తొలి దశ కులగణన

రెండు దశల్లో కులగణన, కేంద్ర కేబినెట్ నిర్ణయం

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో నిర్వహించిన కుల గణన

న్యూఢిల్లీ జూన్ 4 (నిఘా న్యూస్)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ప్రతీ 10 ఏళ్లకోసారి జరిగే ..మిగతా 2లో



గ్లోబల్ డిజిటల్ లీడర్‌గా

## భారత్

2

బ్రిక్స్ దేశాల మధ్య సైబర్ భద్రత బలోపేతం కావాలి

బ్రిక్స్ శిఖరాగ్ర మహిళా పార్లమెంట్ ఫోరంలో ఎంపీ శబరి

ఈవీఎంలను మేనేజ్ చేసి...

## గాలి గాళ్లందరూ గెలిచారు



సూపర్ సిక్స్ కాదు సూపర్ స్కాంలు చేశారు

ఏడాదిలో ఒక్క హామీ అమలు ఏదీ

వెన్నుపోటు నిరసనలో మాజీ మంత్రి ఆర్కే రోజా

తిరుపతి జూన్ 4 (నిఘా న్యూస్)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వచ్చి సంవత్సరం అవుతున్నా, ఇచ్చిన హామీలను అమలు చేయాకుండా రెడ్ బుక్ రాజ్యాన్ని నడుపుతున్నారని మాజీ మంత్రి ఆర్కే రోజా మండిపడ్డారు. రాష్ట్రంలో ఒక్క రోడ్డు అయినా ..మిగతా 2లో

# రాజకీయ ముసుగులో జగన్ నేరాలు

**మొదటి పేజీ తరువాయి...**

ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇది వరకు నేరస్థులు ప్రభుత్వానికి బయపడి వెళ్ళిపోయేవారని ఇప్పుడు మనం నేరస్థులతో రాజకీయాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిరదన్నారు. నేరం చేసి మళ్ళీ ప్రభుత్వంపైనే నిందలు వేసే పరిస్థితి నేడు నెలకొందని తెలిపారు. గంజాయ్ బ్యాచ్ నేరాలు చేసిందని. తప్పులు చేసి తిరిగి ప్రభుత్వంపైనే నెడుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా సీఎంకు మంత్రులు అభినందలు తెలిపారు. కూటమిలోని పక్షాల మధ్య సమన్వయం బాగా ఉందని సీఎం అన్నారు. పీ4కు సంబంధించి ప్రతి జిల్లాలో ఒక కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గం వరకు వెళ్ళాలని మంత్రులకు సూచించారు. విజయ మాల్య లాంటి వాళ్ళు డబ్బులు తిని వెళ్ళిపోయారని, రాజకీయ ముసుగులో ఉండి జగన్ నేరాలు చేస్తున్నారని విమర్శించారు. నేరస్థులను కూడా ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. జగన్, మిథున్ రెడ్డి ఇద్దరిలో ఎవరు ముందు జైలుకు వెళ్తారనే అంశంపై వైసీపీలో చర్చ జరుగుతోందని అన్నారు. తప్పులు చేసిన వారు ఎవరు కూడా తప్పించు కోకూడదని స్పష్టం చేశారు. చట్టం, న్యాయ ప్రకారం వెళ్ళాలని సీఎం తెలిపారు. నేరస్థుడు నేరం చేసి బయటకు వెళ్లిన తరువాత అతను ఏం చేస్తున్నాడనేది తెలుసుకోవాలన్నారు. ఆ సిస్టం వెంటనే అమలు చేయాలని చెప్పారు. రాష్ట్రంలో ప్రమాదకర రాజకీయాలు నడుస్తున్నాయని మంత్రులతో సీఎం చంద్రబాబు అన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో తప్పులు చేసిన పెద్దలు ఇంకా బయటే తిరగటం సబబు కాదని పలువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. ఏ తప్పూ చేయకుండానే తెలుగుదేశం నాయకుల్ని గత ప్రభుత్వంలో జైలుకు పంపారని మంత్రి సంధ్యారాణి గుర్తు చేశారు. మనల్ని అన్యాయంగా వేధించారని మనమూ వేధించటం సరికాదన్న చంద్రబాబు. గత ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై పారదర్శకంగా విచారణ జరుపుతామన్నారు. నేరం రుజువైతే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. రాజకీయ కక్ష



సాధింపులు మన ధోరణి కాదని, ఈ తేడాను ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు.

# బనకచర్లకు కేంద్రం సానుకూలం

**మొదటి పేజీ తరువాయి...**

సూచించారు. రాబోయే ఏడాదికి ప్లాన్ చేసుకోవాలన్నారు. ఏపీ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన కేబినెట్ సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు మంత్రులందరం అభినందనలు తెలిపామని మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడిరచారు. కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు పార్థసారథి వివరించారు. సంక్షేమ కార్యక్రమాలు బాగా చేశామని, కానీ ఏం చేసినా జనాన్ని ఎంపవర్ చేయాలని మంత్రులకు సిఎం తెలిపారు. పోలవరం, బనకచర్ల ప్రాజెక్ట్‌లకు కేంద్రం సాయం చేస్తుందన్నారు. కేంద్రం సానుకూలంగా స్పందిస్తోందని ఆలస్యం అయితే ప్రతీ ఏడాది వ్యయం పెరుగుతుందని అన్నారు. నిధుల సమీకరణ కూడా జరుగు తోందన్నారు. పోలవరం, బనకచర్లకు కేంద్రం, రాష్ట్రం, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, హైబ్రిడ్ అన్యూటీ మోడల్లో కూడా నిధులు వస్తాయని అన్నారు. నదుల అనుసంధానంపై కేంద్రం సానుకూలంగా ఉందంటూ సీఎం సంతోషం వ్యక్తం చేశారు. పోలవరం, బనకచర్లను చేపట్టి ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలన్నారు. క్వాంటం వ్యాలీని చేయాలని.. 2026 జనవరికి కార్యరూపం తీసుకురావాలని వెల్లడిరచారు. క్వాంటం వ్యాలీ బిల్డింగ్ డిజైన్స్‌ను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు పంపించాలని అధికారులకు సీఎం ఆదేశించారు. కేబినెట్‌లో యువగళం గురించి మంత్రి లోకేష్ ప్రస్తావిస్తూ యువగళం ప్రభుత్వానికి బ్రేక్ త్రూ అని వ్యాఖ్యానించారు. అధికారంలోకి రావడానికి, అధికారాన్ని అనుభవించడానికి యువగళం పాత్ర కూడా ఉందని సీఎం అన్నారు. గత ఏడాది ఇదే రోజు మనం ఊహించని విజయం లభించిందన్నారు. ప్రజలు ఆశయాలకు, అంచనాలకు అనుగుణంగా పని చేయాలని ఈ సందర్భంగా మంత్రులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఈ నెల 15న తిరుపతిలో సినిమా సెలబ్రిటీలతో యోగా నిర్వహించాలని తెలిపారు. టూరిజం మంత్రి వెళ్లి సెలబ్రెటీలను ఆహ్వానించాలని తాను కూడా కొంత మందికి ఫోన్లు చేసి చెబుతానని సీఎం అన్నారు. 1983లో మహానాడుకు షర్ట్‌లు పసుపునీళ్లలో ముంచుకుని అటెండ్ అయ్యారని. అప్పటి నుంచి మహానాడు నిర్వహిస్తున్నారన్నారు. వాతావరణం బాగా సహకరించిందని, ఇది వరకు సమ్మర్‌లో అల్లాడి పోయామన్నారు. కానీ ఇప్పుడు వాతావరణం మంచిగా సహకరించిందని అన్నారు. ఈ సారి మహానాడు బాగా జరిగింది... కార్యకర్తలు కూడా బాగా వచ్చారని కేబినెట్ సమావేశంలో తెలిపారు. ఇకపోతే సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదం ఇచ్చింది. వివిధ సంస్థలకు చేసిన భూ కేటాయింపులు, రాయతీల కల్పనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

# గ్లోబల్ డిజిటల్ లీడర్‌గా భారత్

### బ్రిక్స్ దేశాల మధ్య సైబర్ భద్రత బలోపేతం కావాలి

### బ్రిక్స్ శిఖరాగ్ర మహిళా పార్లమెంట్ ఫోరంలో ఎంపీ శబరి

**బ్రెజిల్ జూన్ 4 (నిఘా న్యూస్)**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దూరదృష్టి, నాయకత్వం వల్లే జాతీయ లక్ష్యమే కాకుండా, డిజిటల్ ప్రగతికి, గ్లోబల్ డిజిటల్ లీడర్ గా భారత్ నిలిచిందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బ్రెజిల్ దేశంలోని బ్రెసిలియా నగరంలో జరిగే 11వ బ్రిక్స్ శిఖరాగ్ర సభ పార్లమెంటరీ మహిళా ఫోరంకు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ సమ్మిళిత వృద్ధి, స్థిరమైన అభివృద్ధి, అంతర్ పార్లమెంటరీ సహకారాన్ని ప్రోత్సహించడానికి బ్రిక్స్ భాగస్వామ్య దేశాల అధ్యక్ష అధికారులు, పార్లమెంటేరియన్లతో కలిసిన ప్రతినిదుల బృందం సమావేశాలలో పాల్గొనడం, అందులో మహిళా పార్లమెంటరియన్ ప్రతినిధులకు తాను నాయకత్వం వహించడం మధుర జ్ఞాపకం అన్నారు. కనెక్టివిటీ, ప్రపంచ అవసరం, పర్యావరణ భాధ్యత, డిజిటల్ ఎకో సిస్టటం బ్రిక్స్ భాగస్వామ్య దేశాల లక్ష్యాలు కావాలని అందులో మహిళా పార్లమెంట్ సభ్యుల భాధ్యత పెరగాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.

# వచ్చే ఏడు దేశంలో కుల గణన

**మొదటి పేజీ తరువాయి...**




జనగణన 2021 నుంచి వివిధ కారణాల వల్ల వాయిదా పడుతూనే వస్తోంది. ఇప్పుడు అప్పుడు అంటూ కేంద్ర ప్రభుత్వం వాయిదా వేస్తోంది. తాజా కేంద్ర కేబినెట్ భేటీలో జనగణనకు సంబంధించి కీలక అప్‌డేట్ ఇచ్చారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా కులగణనను రెండు దశల్లో చేపట్టాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది అక్టోబర్ 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా తొలి దశ కులగణన చేపట్టడానికి ప్లాన్ చేస్తుండగా 2027 మార్చి 1వ తేదీ నుంచి రెండో దశ కుల గణన చేయాలని కేంద్ర ప్రభుత్వ వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. అయితే వాస్తవానికి 2020 ఏప్రిల్లో జాతీయ జనాభా గణన ప్రారంభం కావాల్సి ఉండగా, అప్పుడే దేశంలో కరోనా మహమ్మారి వెలుగు చూడటంతో వాయిదా పడింది. ఒకవేళ కొవిడ్ వైరస్ వ్యాప్తి లేక అప్పుడే ఈ జనగణన చేసి ఉంటే.. తుది నివేదిక 2021 నాటికి వెలువడేది. ఇక తొలి దశలో భాగంగా 2026 అక్టోబర్ 1వ తేదీ నుంచి ఉత్తరాఖండ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో కులగణన, జనగణన చేయనున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. రెండో దశ 2027 మార్చి 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా మిగిలిన ప్రాంతాల్లో కులగణనతో పాటు జనగణనను నిర్వహించనున్నారు. ఈ కులగణన, జనగణన ప్రక్రియకు సంబంధించిన అధికారిక గెజిట్‌ను జూన్ 16వ తేదీన కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ విడుదల చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ జనగణన, కులగణనలో పురుషులు, మహిళలను లెక్కించనున్నారు. ఇందులో భాగంగానే కులం, ఉపకులాలను లెక్కించి జాబితాను తయారు చేయనున్నారు. కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో ఈ జనాభా లెక్కలను నిర్వహించనున్నారు. ఈ జనగణన, కుల గణనను పారదర్శక పద్ధతిలో నిర్వహిస్తామని తెలిపారు. అయితే దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గత కొన్నేళ్లుగా కాంగ్రెస్ సహా ఇండియా కూటమి పార్టీలతో పాటు పలు ప్రాంతీయ పార్టీలు కూడా డిమాండ్ చేస్తున్నాయి. దేశంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకలు కులగణన సర్వేను నిర్వహించాయి.

# మెంటల్ ఆసుపత్రి ఘటనపై మంత్రి ఆరా

**మొదటి పేజీ తరువాయి...**

ఉస్మానియా సహా ఇతర ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసిన ఆరు వైద్య బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. ఈ ఘటనపై మంత్రి దామోదర రాజ నరసింహ మాట్లాడుతూ, ఫుడ్ పాయిజన్ కు కారణంగా ఆసుపత్రిలో అందించిన ఆహారమే అని ప్రాథమికంగా నిర్ధారణ అయినట్లు వెల్లడిరచారు. అదనంగా అందించిన స్వీట్ కూడా అనారోగ్యానికి కారణమైనట్లు అనుమానం వ్యక్తం చేశారు. ప్రస్తుతం బాధితుల ఆరోగ్యం మెరుగవుతోందనీ, ప్రాణాలకు ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. వారు రెండు రోజుల్లో పూర్తిగా కోలుకుంటారని చెప్పారు. ఈ ఘటనకు కారణమైన డైయట్‌ను పర్యవేక్షించే కాంట్రాక్టర్ పనితీరు సంతృప్తికరంగా లేనందున అతని కాంట్రాక్టును రద్దు చేసినట్లు- మంత్రి తెలిపారు. ఇదే సమయంలో ఘటనపై సమగ్ర విచారణ కోసం ఒక ప్రత్యేక కమిటీని నియమించామని, కమిటీ నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఇక ఫుడ్ పాయిజన్ కారణంగా మరణించిన వ్యక్తి కరణ్‌కు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉన్నట్లు- మంత్రి పేర్కొన్నారు. కరోనా వ్యాప్తి కోణంలో ఈ ఘటనపై ఆందోళన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో కలుషితాహారం ఘటనలో మంగళవారం ఒక రోగి మృతి చెందడంతో పాటు 70 మంది అస్వస్థతకు గురయ్యారు. బుధవారం కూడా పలువురు రోగులు డయేరియా లక్షణాలతో బాధపడుతున్నారు. వీరిలో 18 మందిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కలుషితాహార ఘటనపై ఎర్రగడ్డ ఆసుపత్రిలో డీఎంఈ, డీఎంహెచ్‌వో, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు. తాగునీరు కలుషితమైందా అనే కోణంలోనూ పరిశీలిస్తున్నారు. ఈ సంఘటనకు కారణాలు తెలుసుకునేందుకు నమూనాలను పరీక్షలకు పంపారు.

# నేడే కేబినెట్ మీటింగ్

**మొదటి పేజీ తరువాయి...**

ఇందిరమ్మ ఇల్లు, ఉద్యోగుల పెండింగ్ సమస్యలు, వానాకాలం సాగు తదితర అంశాలపై కేబినెట్ చర్చించనుంది. రాజీవ్ యువ వికాసం పథకంలో ఐదు లక్షల మందికి లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం భావించగా, అంచనాలకు మించి సుమారు పదహారున్నర లక్షల దరఖాస్తులు వచ్చాయి. మొదటి విడతలో లక్ష రూపాయల వరకు కేటగిరి లబ్ధిదారులకు రాష్ట్ర అవతరణ దినోత్సవాన ప్రారంభించాలని భావించినప్పటిక గందరగోళం తలెత్తే అవకాశం ఉన్నందున వాయిదా వేశారు. మరికొంతమందికి లబ్ధి చేకూర్చేలా నిర్ణయాలు తీసుకునే అంశంపై చర్చించే అవకాశం ఉంది. రైతు భరోసాపై క్లారిటీ : ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నియోజకవర్గానికి 3,500 ఇల్లు మొదటి విడతలో ఇచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే సుమారు రెండున్నర లక్షల మంది మంజూరు పత్రాలు ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక, ఇటుక, స్టీలు ఇతర నిర్మాణ సామాగ్రిని అందుబాటులో చౌక ధరలకు అందించే అంశంపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏలు, ఇతర అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. వానకాలం సాగు సన్నద్ధత, రైతు భరోసాపై చర్చించనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో హ్యామ్ పద్ధతిలో రోడ్ల నిర్మాణంపై చర్చించే అవకాశం ఉంది.

# తెలంగాణలో ఏడుగురు సీనియర్ ఐపీఎస్ అధికారుల బదిలీలు

### ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్ జూన్ 4 (నిఘా న్యూస్)**

తెలంగాణలో ఏడుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా అభిలాష బిస్త్, మహిళా భద్రత విభాగం, సీఐడీ అదనపు డీజీగా చారు సిన్హా, ఎఫ్ఎస్ఎల్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్‌గా కొనసాగనున్న శిఖా గోయల్, చార్మినార్ రేంజ్ డీఐజీగా తఫ్సీర్ ఇక్బాల్, మెదక్ ఎస్పీగా డీవీ శ్రీనివాసరావు, ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్, సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా చైతన్యకుమార్ బదిలీ అయ్యారు.



# విక్టరీ పరేడ్ తొక్కిసలాటలో 11 మంది మృతి

తయారైంది. మంగళవారం జరిగిన ఐపీఎల్ ఫైనల్‌లో పంజాబ్‌ను ఓడించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు. ఐపీఎల్ చరిత్రలో తొలిసారి కప్‌ను ముద్దాడింది. ఈ క్రమంలోనే గత 18 ఏళ్లుగా ఆర్సీబీ ఫ్యాన్స్ ఎదురు చూస్తున్న తరుణం రావడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషీగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు, తమ విజయాన్ని సెలబ్రేట్ చేసుకునేందుకు ఇవాళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియానికి చేరుకుంది. ఈ క్రమంలోనే ఆర్సీబీ ఆటగాళ్లను చూసేందుకు ఫ్యాన్స్, జనం భారీగా ఎగబడ్డారు. ఆర్సీబీ విక్టరీ జరుపుకునేందుకు భారీగా అభిమానులు రావడంతో చిన్నస్వామి స్టేడియం వద్ద వేలాది మంది గుమిగూడారు. భారీగా వచ్చిన స్టేడియానికి పోటెత్తిన ఆర్సీబీ ఫ్యాన్స్‌ను అడ్డుకునేందుకు పోలీసులు శతవిధాలా ప్రయత్నించారు. ఈ తొక్కిసలాటలో ఇప్పటివరకు 11 మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో అభిమానులు తీవ్ర గాయాల పాలయ్యారు. ఆర్సీబీ జట్టు స్టేడియానికి వస్తుందని తెలుసుకున్న ఫ్యాన్స్ వారితో కలిసి సంబరాలు చేసుకునేందుకు మధ్యాహ్నం నుంచే స్టేడియం వద్దకు వేలాది మంది చేరుకున్నారు. తొక్కిసలాట సమయంలో స్టేడియంలోనే కర్ణాటక గవర్నర్, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, మంత్రులు ఉన్నారు. దీంతో చిన్న స్వామి స్టేడియం పరిసర ప్రాంతాల్లో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను క్రమ బద్ధీకరించడానికి తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ తొక్కిసలాటలో గాయపడిన వారిని శివాజీ నగర్‌లోని బౌరింగ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆర్సీబీ ఆటగాళ్లు చిన్నస్వామి స్టేడియానికి రాకముందు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వారిని విధాన సౌధలో సన్మానించారు.

# ఈవీఎంలను మేనేజ్ చేసి... గాలి గాళ్ళందరూ గెలిచారు

**మొదటి పేజీ తరువాయి...**

కూటమి ప్రభుత్వం వేసిందా అని ప్రశ్నించారు. కూటమి నేతలు సూపర్ సిక్స్ పక్కనపెట్టి సూపర్ స్కామ్‌లు చేస్తున్నారని విమర్శించారు. కూటమి నేతలు రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి, ఇసుక మాఫియాతో రెచ్చిపోతున్నారన్నారు. చంద్రబాబు వచ్చాక టీడీపీ నేతలకు పదవులు వచ్చాయని, ప్రజల చేతికి మాత్రం చిప్ప ఇచ్చారని రోజా ఎద్దేవా చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపు మేరకు ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ పార్టీ నేతలు 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా నగరిలో నిర్వహించిన వెన్నుపోటు దినంలో ఆర్కే రోజా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ 'సంవత్సరం అవుతున్నా ఇచ్చిన హామీలను అమలు చేయాకుండా రెడ్ బుక్ రాజ్యాన్ని నడుపుతున్నారు. రాష్ట్రంలో ఒక్క రోడ్డు అయినా కూటమి ప్రభుత్వం వేసిందా సూపర్ సిక్స్ పక్కనపెట్టి సూపర్ స్కామ్‌లు చేస్తున్నారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి, ఇసుక మాఫియాతో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. వైసీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి వేదిస్తున్నారు. మా నేతలపై కేసులు పెట్టిన వారిని వదిలిపెట్టము. ఫ్యాకేజ్ ఇస్తే పిఠాపురంలో యువతిపై రేప్ జరిగినా పవన్ కళ్యాణ్ కి అవసరం లేదు. ప్రజలను ఎదురుగా నిలుచుని చంద్రబాబు వెన్నుపోటు పోడిస్తే సైడ్ నుండి వెన్నుపోటు పొడిచిన కన్నింగ్ కట్టప్పలు లోకేష్, పవన్. ప్రజలను కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. ఎన్నికల ముందు టీడీపీ నేతలు వచ్చేది బాబే, జాబు ఇచ్చేది బాబే అన్నారు. చంద్రబాబు వచ్చాక టీడీపీ నేతలకు పదవులు వచ్చాయి, ప్రజల చేతికి మాత్రం చిప్ప ఇచ్చారు. సూపర్ సిక్స్ ఒక్క హామీ అమలు చేయలేదు. కూటమి నేతలు ఈవీఎంలను మ్యానెజ్ చేసి యాబ్బై, అరవై వేల మెజారిటీ తెచ్చుకున్నారు. అందరూ గాల్లో గెలిచిపోయిన గాలి గాళ్లే రాష్ట్రం మొత్తం ఉన్నారు. చంద్రబాబు అంటే వెన్నుపోటు వెన్నుపోటు అంటే చంద్రబాబు. రాష్ట్రంలో ఉన్న అప్పులు మొత్తం తీర్చి ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్ ది. విద్యా వ్యవస్థను నాశనం చేశారు. రైతుల ఏ పంటకు గిట్టుబాటు ధర లేదని ఆర్కే రోజా చెప్పుకొచ్చారు.

# మేఘా కృష్ణారెడ్డికి.... నోటీసులు ఇచ్చే దమ్ముందా!

**మొదటి పేజీ తరువాయి...**

మీటర్లపైకి ఎత్తిపోసే ప్రాజెక్టు కేసీఆర్‌దేనన్నారు. తెలంగాణ సస్యశ్యామలం కావాలని కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరమని దాదాపు 40 లక్షల ఎకరాలకు నీళ్ల అం దించే ప్రాజెక్టుపై కుట్ర చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం. కేసీఆర్‌ని బద్నాం చేయడానికి మాత్రమే కాళేశ్వరం కమిషన్ వేసిందని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేస్తూ 90 శాతం పనులను మేఘా కృష్ణారెడ్డి కంపెనీకి ఇచ్చారని మేడిగడ్డకు చిన్న చిన్న మరమ్మతులు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పొలాలను ఎండబెడుతోందని కాళేశ్వరం ప్రాజెక్టులో 15 పంప్ హౌస్ పనులు చేసిన మెఘా కృష్ణారెడ్డిని కమిషన్ ముందుకు పిలిచే ధైర్యం రేవంత్ రెడ్డికి లేకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల కోసం, కాంట్రాక్టర్ల కోసం మాత్రమే పనిచేస్తోందని మండిపడ్డారు. 90 శాతం పంప్‌హౌస్‌ల పనులు చేసిన కాంట్రాక్టర్‌ను ఎందుకు వదిలేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.



చంద్రబాబు ఎన్డీఏలో ఉన్నందున జల దోపిడి చేసినా రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రశ్నించడం లేదన్నారు. బీజేపీలో ఉన్న ఒకే ఒక తెలంగాణ బిడ్డ ఈటల రాజేందర్ కూడా మాట్లడక పోవడం శోచనీయమన్నారు. బకనచర్ల ప్రాజెక్టును ఆపే ప్రయత్నం చేసే బాధ్యతను ఈటల రాజేందర్ తీసుకోవాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హెూదా తీసుకొచ్చే బాధ్యతను కూడా ఈటల రాజేందర్ తీసుకోవాలన్నారు. గోదావరి నీటిలో వెయ్యి టీఎంసీల హక్కును సాధించే వరకు తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జారీ చేసిన నోటీసులకు వ్యతిరేకంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 40 లక్షల ఎకరాలకు నీళ్ల అందించబడ్డాయి. ఇలాంటి ప్రాజెక్టుపై ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. తెలంగాణ బీజేపీ నేతలు కేంద్రాన్ని ప్రశ్నించడం లేదు. ఎన్డీఏలో చంద్రబాబు ఉన్నాడన్న కారణంతో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని పట్టించుకోవడం లేదు. ఒకే ఒక తెలంగాణ బిడ్డ ఈటల రాజేందర్ కూడా నోరు విపించకపోవడం శోచనీయం. ఆయన కనీసం బకనచర్ల ప్రాజెక్టు విషయానికైనా స్పందించాలి. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హెూదా తీసుకురావాల్సిన బాధ్యతను కూడా ఈటల తీసుకోవాలి,' అన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరగాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**హుజురాబాద్, జూన్ 4(నిఘా న్యూస్):** హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి అన్నారు. నవజాత శిశువుల వార్డు సందర్శించి పిల్లలకి వచ్చిన సమస్యల గురించి తెలుసుకున్నారు. గర్భిణీ బాలింతలతో మాట్లాడారు. తల్లిపాల ప్రాముఖ్యతను, సాధారణ ప్రసవం ప్రాధాన్యతను అక్కడి మహిళలకు వివరించారు. అనంతరం వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని, సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలపాలన్నారు. వైద్య సహాయం అవసరం అనుకుంటే గర్భిణీలను ప్రసవ గడువు కంటే ముందే ఆస్పత్రిలో చేర్చుకోవాలని అన్నారు. నవజాత శిశువులు, పిల్లల సేవల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య మహిళ క్యాంపును వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. మెప్మా, ఐకెపి సిబ్బంది ద్వారా ఆరోగ్య మహిళ ఉచిత వైద్య పరీక్షల పట్ల మహిళలకు అవగాహన కల్పించి క్యాంపును సద్వినియోగం చేసుకునేలా చూడాలని తెలిపారు. ఈ క్యాంప్ ద్వారా సుమారు 50 వేల రూపాయల ఖరీదు చేసే 47 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్న విషయం మహిళల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ముఖ్యంగా 40 సంవత్సరాలు దాటిన మహిళలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి బీపీ, షుగర్ థైరాయిడ్ వంటి మందులను అందించాలని అన్నారు. 108 సేవలకు ఎటువంటి అంతరాయం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. అవసరమైన సౌకర్యాలు సమకూర్చుకోవాలని ఆదేశించారు. అంతకుముందు ఆసుపత్రి ఆవరణలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మొక్కలు నాటారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డి సి హెచ్ చంద్రశేఖర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణరెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ రమేష్, జమ్మికుంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పారిపల్లి శ్రీకాంత్ రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్వో చందు, ఆర్డీవో రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య పాల్గొన్నారు.





వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు వేముల వెంకటేష్ కు రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘం నాయకుల ఆధ్వర్యంలో నివాళులు అర్పించి,కుటుంబ సభ్యులను పరామర్శించారు.
– విద్యానగర్, జూన్ 4 (నిఘా న్యూస్):

## చిలుకానగర్‌లో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్



**చిలుకానగర్, జూన్ 4 (నిఘా న్యూస్):** జిహెచ్ఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు రాబోవు వర్షాకాలంలో ప్రజారోగ్యం, పారిశుద్ధ్య విషయమై ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకొని జిహెచ్ఎంసి అన్ని సర్కిల్ ల యందు ముందస్తు వర్షాకాల ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించిన నేపథ్యంలో బుధవారం ఉప్పల్ సర్కిల్ చిల్కానగర్ డివిజన్ హెచ్‌బిహెచ్ కాలనీ, అన్నపూర్ణ కాలనీ, వార్డ్ ఆఫీసు రోడ్డు, హైకోర్టు కాలనీ, అజ్మత్ నగర్ కాలనీ, బాలాజీ ఎంక్లేవ్, శివాలయం రోడ్డు, శ్రీరామ్ నగర్ కాలనీ, ఆనంద్ నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కాలనీ రోడ్లను, ఖాళీ ప్రదేశాలను శుభ్రం చేసి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి చెత్తను ఎత్తివేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ పారిశుధ్య విభాగం డి. ఈ, చందన చౌహాన్, ఎస్ ఎఫ్ఏలు, జవాన్లు, పారిశుధ్య సిబ్బంది, ఎంటమాలజీ విభాగం, ఏఈ. నరేష్ రెడ్డి, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొని దోమల నివారణకై మందులు స్ప్రే చేశారు. ప్రజలు వారి ఇంటి నుండి వ్యాపార స్థలాల నుండి వెలువడే చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పడ వేయకుండా జిహెచ్ఎంసి స్వచ్ఛ ఆటో వారికి అందించాలని ఎక్కడపడితే అక్కడ పడవేయడం వలన వర్షాకాలంలో నాళాలు మోరీలు చెత్తతో నిండిపోవడం వలన వర్షం నీరు కాలనీలలో నిలిచిపోయి దుర్వాసన, ప్రాణాంతకమైన అంటువ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున ప్రజలందరూ ఈ సూచనలను పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాలలో నీరు నిరువకుండా అందువల్ల దోమలు అభివృద్ధి చెందకుండా మన వంతు బాధ్యతగా ఉండాలని జిహెచ్ఎంసి అధికారులు తెలియజేశారు.

## శ్రీకాళహస్తిలో ద ఉచిత సేవకులకు అన్యాయం

### కాంగ్రెస్ అండగా ఉంటుందని నేతల భరోసా



**శ్రీకాళహస్తి, జూన్ 4 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డిని శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం నందు పనిచేస్తున్న సేవకులు వారికి జరిగిన అన్యాయాన్ని తెలియజేసి వారికి న్యాయం చేయాలని కోరారు. డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ దేవస్థానం నందు పనిచేస్తున్న సేవకుల వివరాలు తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ తరఫున వారికి తగు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని వారికి అండగా ఉంటామని తెలియజేశారు. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్నటువంటి సేవకులను హఠాత్తుగా నిలిపివేసి వారి కుటుంబం మునుగడను ప్రశ్నార్థకం చేసిన నేపథ్యంలో వారికి కోర్టు నందు స్టే వుండినను వారికి ఆలయ అధికారులు తగు న్యాయం చేయకుండా వారిని తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్న కారణంగా సేవకులకు కాంగ్రెస్ పార్టీ తరఫున అండగా ఉండి వారికి న్యాయం చేయు వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని అదేవిధంగా ఆలయ అధికారులు కూడా వీటిపై పూర్తి విచారణ జరిపి వారికి న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ తరఫున కోరుకుంటున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, అంటోని, శ్రీకాళహస్తి మండల యువజన అధ్యక్షులు నవీన్, కర్రీముల, ఫటాన్ ఆల్తాఫ్, షేక్ బబ్లు దేవస్థాన కార్మికులు పాల్గొన్నారు.

# పాకాలలో కూటమి సంబరాలు

### ఏడాది పూర్తయిన సందర్భంగా బాబు చిత్రపటానికి పాలాభిషేకం




**చంద్రగిరి, జూన్ 4(నిఘా న్యూస్):** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం దినసరి కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న టిడిపి కార్యాలయం వద్ద ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయిన సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సూచనలతో బుధవారం జడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి,టిడిపి మండల అధ్యక్షుడు బోయపాటి నాగరాజు నాయుడు,టిడిపి నాయకులు,తెలుగు మహిళలు కలిసి కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టి,సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ టిడిపి మండల అధ్యక్షుడు మందలపు వెంకటేష్ బాబు, నంగా పద్మజా రెడ్డిలు మాట్లాడుతూ కూటమి ప్రభావం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా గ్రామాలలో,టిడిపి కార్యాల వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి,కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టి సంబరాలు చేసుకున్నామని పేర్కొన్నారు. భారతదేశ రాజకీయ చరిత్రలో నిలిచిపోయే రోజు,ఐదు ఏళ్ల అరాచక పాలనను తరిమికొట్టి,నిరంకుశ ఫ్యూడలిస్టిక్ కోటలను ప్రజలు తమ ఓటు హక్కుతో బద్దలుకొట్టి,ప్రజాస్వామ్య పరిరక్షణకు నాంది పలికిన రోజు అని అన్నారు. దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న నవ భారత్ నిర్మాత ప్రధాని నరేంద్ర మోదీ దృఢమైన నాయకత్వం, నాలుగున్నర దశాబ్దాల రాజకీయ అనుభవం,ఎన్నో ఆటు పోటులను ఎదుర్కొని ప్రజాక్షేత్రంలో దృఢంగా నిలచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో,దశాబ్ద కాలంగా ఎన్నో పోరాటాలు చేసి,మరెన్నో దాష్టికాలను తట్టుకుని అడ్డుగోడగా నిలచిన జనసైనికులు,వీర మహిళల పోరాట స్ఫూర్తి,వ్యవస్థలో మార్పు తీసుకురావాలనే జనసేన పార్టీ సంకల్పానికి ప్రజలు అండగా నిలిచి చారిత్రాత్మక విజయాన్ని అందించిన రోజు. ప్రజలు ఇచ్చిన తీర్పును బాధ్యతగా తీసుకున్నాం అని గత తప్పిదాలను సరిచేస్తూ,భావి తరాలకు బంగారు భవిష్యత్తు అందించేలా,రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్ర 2047 దిశగా నడిపించేందుకు,వికసిత్ భారత్ 2047లో కీలక భాగస్వామిగా అయ్యేందుకు ఉమ్మడి ప్రణాళికతో,రాజకీయాలకు అతీతంగా ఆంధ్రప్రజల ఆకాంక్షలే లక్ష్యంగా"తెలుగుదేశం పార్టీ–జనసేన పార్టీ–బీజేపీ"పార్టీల ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా పరిపాలనను అందిస్తుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరింత సమర్థవంతమైన పరిపాలన అందిస్తామని,సంక్షేమాభివృద్ధి సాధించేలా మరింత బాధ్యతతో కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ కు వికారాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు మహేష్ గౌడ్, బైరి నవీన్ గౌడ్ పాల్గొన్నారు.
– వికారాబాద్, జూన్ 4 (నిఘా న్యూస్):




దళిత నాయకుడు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు బైగళ్ల ఓం ప్రకాష్ జిల్లెల గూడలో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ జన్మదిన వేడుకలలో మాజీ కార్పొరేటర్, దళిత రత్న గజ్జెల రాంచందర్ శాలువా కప్పి సన్మానించి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మామిడి సుదర్శన్ రెడ్డి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.
– బాలాపూర్, జూన్ 4 (నిఘా న్యూస్):

# లేమామిడిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణనికి భూమి పూజ



కేసంపేట, జూన్ 4 (నిఘా న్యూస్): ప్రజల వద్దకు రెవెన్యూ నినాదంతో రైతుల భూ సమస్యలను పరిష్కరించడం ఈ సదస్సుల ప్రధాన లక్ష్యమనీ షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. నియోజకవర్గంలోని కేశంపేట మండలం లేమామిడి గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. అదేవిధంగా ఈ గ్రామంతో పాటు తురకలపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సరిదిద్దడమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశం అని ఎమ్మెల్యే శంకర్ వెల్లడించారు. అదేవిధంగా కేశంపేట మండలం లేమామిడి గ్రామపంచాయతీ తుర్కలపల్లి లేమామిడి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణనికి భూమి పూజ చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన%శీ%తరం లేమామిడి గ్రామంలో రైతు వేదిక వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ రైతులతో మాట్లాడారు. సదస్సుకు సంబంధించిన పలు విషయాలను వారితో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్, మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గూడ వీరేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, తహశీల్దార్ అంజద్ అలీ, నేతలు కృష్ణ రెడ్డి,బాలరాజు గౌడ్, శ్రీధర్ రెడ్డి, శ్రీను నాయక్, రూప్ల నాయక్, భాస్కర్ గౌడ్, కరుణాకర్, పెంటయ్య, అఖిల్, అమీర్, రమేష్, సుదర్శన్, రాములు పర్వతాలు, అంజయ్య, గోపాల్, సరికొండ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జన్మదినంను పురస్కరించుకుని సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో కలిసి స్పీకర్ గడ్డం ప్రసాద్ నివాసానికి చేరుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలతో శాలువాలతో సన్మానించారు.
– తాండూరు, జూన్ 4 (నిఘా న్యూస్):

# శ్రీ కనిగిరి ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం




**ఉప్పల్, జూన్ 4 (నిఘా న్యూస్):** ఉప్పల్ స్వరూప్ నగర్ లోని కనిగిరి వెంకటేశ్వర స్వామి దేవాదాయ ధర్మాదాయ ట్రస్టీ బోర్డు ధర్మకర్తలుగా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ధర్మకర్తలుగా బిక్కుమల్ల రమేష్ గుప్తా , చింతలకుంట శ్రీనివాసరెడ్డి, కొన్నాని అంజిరెడ్డి , యాసోజు నరసింహ చారి, పూజారి హనుమంతు, షామీర్పేట్ రాకేష్ రెడ్డి , సుదుగు భాస్కర్ రెడ్డి, ఆనంద్ ప్రభు, నాగారం గాయత్రి దేవి , గజ్జల వెంకట్ రెడ్డి, వంక పవన్ కుమార్, కందాడి సత్తిరెడ్డి , కే శ్రీనివాస్ లను ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈఓ. %శ్రీ% వెంకన్న, డివిజన్ అధ్యక్షులు బాకారం లక్ష్మణ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోదుగు శేఖర్ రెడ్డి, మోదుగు మోహన్ రెడ్డి, చెన్ రెడ్డి రఘుపతి రెడ్డి,బిక్కుమల్ల అంజయ్య గుప్తా , పూజల ప్రభాకర్,ఈగ అంజయ్య ముదిరాజ్ ,తెలకల మోహన్ రెడ్డి , బజారు జగన్నాథ గౌడ్ , ఆకిటి ఆగం రెడ్డి , భాస్కర్ రెడ్డి,బాబురావు, భూసం రఘునాథరెడ్డి ,సల్ల ప్రభాకర్ రెడ్డి, మంద మురళి కృష్ణారెడ్డి, నాగారం వెంకటేష్, మాశెట్టి రాఘవేంద్ర , సతీష్ , బజార్ నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**నాగార్జునసాగర్, జూన్ 4 (నిఘా న్యూస్):** నందికొండ మున్సిపాలిటీలో బుధవారం తెల్లవారు జామున పైలాన్ కాలనీ బైపాస్ నందు గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడం వల్ల యాచకుడు అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. చుట్టుపక్కల వారిని విచారించగా అతడు గత వారం రోజులుగా పైలాన్‌లో సంచరిస్తూ భిక్షాటన చేస్తూ ఫుట్ పాత్ పై పడుకుంటూ జీవిస్తున్నాడు అని, అతని వయసు సుమారు 70 సంవత్సరాలు ఉండి హిందీ మాట్లాడుతున్నాడు అని తెలపడం జరిగింది. అతని ఆచూకీ తెలిసిన యెడల విజయపురి టౌన్ ఎస్‌ఐ ను సంప్రదించగలరు.

# శ్రీకాళహస్తిలో కొత్త రాజకీయాలకు తెరలేపిన కూటమి

- **కూటమి విధానాలనే రేపు అధికారంలోకి వచ్చాక అమలు చేయడం ఖాయం**
- **శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు రెడ్డి**

**శ్రీకాళహస్తి, జూన్ 4 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తిలో వైసిపి పిలుపుమేరకు బుధవారం వెన్నుపోటు దినం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తదితరులు. అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ర్యాలీగా వెళ్లి ఆర్డిఓ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ శాంతికి అర్జీ ఇచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికారం చేపట్టడం లక్ష్యంగా చంద్రబాబు నాయుడు మోసపూరిత హామీలను గుప్పించారు. సూపర్ సిక్స్ అంటూ బూటకపు మేనిఫెస్టోను తీసుకువచ్చారు. చివరికి అధికారం చేపట్టిన మరుక్షణం నుంచి ఆర్థిక స్థితి బాగోలేదంటూ మానిఫెస్టోను మూలన పడేశారు. అభివృద్ధిని అటకెక్కించే సంక్షేమ పథకాలను గాలికి వదిలేశారు. ప్రధానంగా మహిళా శక్తి పేరుతో ఆడపడుచులకు ఇచ్చిన హామీలను తల్లికి వందనం, ఆడబిడ్డ నీది, ఉచిత బస్సు వంటి పథకాలను ఇస్తానని అక్క చెల్లెమ్మలకు వెన్నుపోటు పొడిచాడు. ప్రభుత్వాలు తప్పు చేసిన, సామాన్య ప్రజలకు అన్యాయం జరిగినా స్పందించి ప్రశ్నిస్తానన్నా పవన్ కళ్యాణ్ ఏమయ్యారు. కూటమి ప్రభుత్వం పాలన ఏడాది గడుస్తున్న ప్రజలకు చిల్లి గవ్వ చేతికిందలేదు. ప్రజల పక్షాన నిలుస్తున్న వారిపై దాడులు దౌర్జన్యాలు కేసులు అరెస్టులతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. శ్రీకాళహస్తిలో ఇసుక మాఫియా విపరీతంగా పెరిగిపోయి, ఉచిత ఇసుక అంటూ అధరగొట్టి పచ్చ ముఠాకు ప్రకృతి వనరులను అప్పగించేశారు. సిసి రోడ్లు, భవనాలు, పంచాయతీ పనులు, ఆర్ అండ్ బి,గనుల కాంట్రాక్టు వంటి పనులను తెలుగు తమ్ముళ్లకు కట్టబెట్టి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టారు. శ్రీకాళహస్తిలో ఎప్పుడూ లేనివిధంగా కొత్త రాజకీయాలకు తెరదీశారు. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఎన్నికల వరకే ప్రత్యర్థులుగా చూసే వాళ్ళము ఆ తర్వాత ప్రతి ఒక్కరికి పనిచేసి అందరూ బాగుండాలని కోరుకున్నాము.

కానీ నేడు శ్రీకాళహస్తిలో ఆ పరిస్థితి లేదు. ఇలాగే ఓ నూతన వరవడికి శ్రీకారం చుడితే రేపు అధికారంలోకి వచ్చేది మేమే అప్పుడు నేను చెప్పినా కూడా మా కార్యకర్తలు నా మాట వినే పరిస్థితి ఉండకపోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, కంట ఉదయ్ శరవణ సురేష్ వయ్యాల కృష్ణారెడ్డి, ఓడూరు గిరిధర్ రెడ్డి,బర్రి సుదర్శన్ రెడ్డి,గున్నేరి కిషోర్ రెడ్డి,కూనాటి రమణయ్య యాదవ్,గంగారి రమేష్, చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి,హరి ప్రసాద్ రెడ్డి, పగడాల రాజు, ప్రభాకర్ వైయస్సార్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## భగాయత్ పార్కులో గుర్తు తెలియని మృతదేహం



**ఉప్పల్, జూన్ 4 (నిఘా న్యూస్):** ఉప్పల్ బగాయత్‌లోని మున్సిపల్ పార్క్‌లో ఓ గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం లభ్యం అయింది. ఉప్పల్ పోలీస్ స్టేషన్ బ్లూ కూల్ట్స్ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా స్థానికులు అందించిన సమాచారం మేరకు వెళ్లి చూడగా సుమారు 55నుంచి 60సంవత్సరాల మధ్య వయసుగల వృద్ధుడు చనిపోయి ఉన్నారు. మృతుడి ఒంటిపై తెలుపు రంగు గీతల, బ్రౌన్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు, చూడడానికి బిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తూన్నట్లు తెలుస్తుందని, శరీరంపై ఎటువంటి గాయాలు లేవని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుడు వడదెబ్బ, ఇతర అనారోగ్య కారణాలతో చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి సంబంధించిన బంధువులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు గాని ఎవరైనా మృతుడిని గుర్తించిన తో వచ్చి ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఉప్పల్ పోలీసులు కోరారు.



## బస్టాండ్ రైల్వే స్టేషన్లలో పోలీసుల తనిఖీలు

### ఘట్కేసర్ సందర్భంగా సిఐ పరుశురామ్

**ఘట్‌కేసర్, జూన్ 4 (నిఘా న్యూస్):** ఘట్ కేసర్‌లో రైల్వే స్టేషన్ బస్టాండ్లలో తనిఖీలు చేపట్టిన ఘట్కేసర్ పోలీసులు. సందర్భంగా సిఐ పరుశురామ్ మాట్లాడుతూ రాచకొండ సిపి జి సుధీర్ బాబు ఆదేశాల మేరకు ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘట్కేసర్ రైల్వే స్టేషన్, ఘట్కేసర్ బస్టాండ్, దేవాలయాలు మసీద్ లలో, ఆర్టీసీ బస్సులలో అత్యధిక జన సమూహం కలిగిన షాపింగ్ మాల్స్ మార్ట్ లు తదితర ప్రాంతాలలో డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ తో తనిఖీలను చేస్తున్నామని ఆయన అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు చేపడుతున్నామని ఆయన చెప్పారు. పెంచారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందు వస్తు జాగ్రత్తలు చేపట్టి తనిఖీలను నిర్వహిస్తున్నామని ప్రజలకు బాధ్యత కల్పించేందుకు రాచకొండ పోలీస్ లు ప్రత్యేక చర్య తీసుకున్నారని ఆయన తెలిపారు.

## మామిండ్ల వాడలో పారిశుధ్యం డ్రైవ్




**హుజురాబాద్, జూన్ 4 (నిఘా న్యూస్):** పర్యావరణ అనుకూలత నగరాలుగా అభివృద్ధి చేయుటకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం మున్సిపల్ కమిషనర్ కేంసారపు సమ్మయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని 16వ, 17వ వార్డుల నందు మామిండ్ల వాడ ఏరియాలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమములో మునిసిపల్ శాఖ వారు కాలనీ నందు రోడ్లకు ఇరువైపులా పెరిగిన గడ్డి మొక్కలను చెత్తా చెదారమును జంగిల్ క్లియరెన్స్ చేశారు. వర్షాల వలన వరదనీరు మురికి కాలువల నుండి రోడ్ల పైకి చేరకుండా, మురికి కాలువలలో పేరుకు పోయిన సిల్టును మట్టిని తొలగించారు. అదేవిధంగా, రోడ్లపై వాహనాలకు అడ్డుగా వేసిన మొరం ఇసుక కుప్పలను జెసిబితో పక్కకు నెట్టి రోడ్డులను క్లియరెన్స్ చేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ అసిస్టెంట్ ఇంజనీర్ ఎన్. సుధాకర్ జూనియర్ సహాయకులు రవీందర్, రాజయ్య, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ పి.వినయ్, వార్డు అధికారులు, సానిటరీ జవాన్లు, ప్రతాప రాజు, ఆరెల్లి రమేష్, టి.కుమారస్వామి, పి.అనిల్ కుమార్, మెప్మా ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బంగారమ్మ తల్లికి పట్టు వస్త్రాలు



**శ్రీకాళహస్తి, జూన్ 4 (నిఘా న్యూస్):** ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ శ్రీ బంగారమ్మ జాతర మహోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలను సమర్పించిన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మాతృమూర్తి బొజ్జల బృందమ్మ శ్రీ బంగారమ్మకు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు విజయకుమార్ చెంచయ్య నాయుడు హరి బాలాజీ సుమతి మల్లీశ్వరి ఆలయ అధికారులు సబ్ టెంపుల్ ఇన్చార్జ్ లక్ష్మయ్య ప్రదీప్, సూపరింటెండెంట్ హేమమాలిని బంగారమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పురాతన ఇండ్లు కూల్చివేత

### పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యత



**మహేశ్వరం, జూన్ 4(నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా మూడవ రోజు తుక్కుగూడ పురపాలక సంఘం పరిధిలో గల కమర్షియల్ బిల్డింగ్స్ షాప్స్‌ను గుర్తించి కమీషనర్ వాణి రెడ్డి అధ్వర్యంలో నూతన ట్రేడ్ లైసెన్సులు జారీ చేశారు.

తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం, పారిశుధ్య నిర్వహణ, 15వ వార్డులో శిథిలావస్థలో ఉన్న ఇండ్లను కూల్చి వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వాణి రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతలో ప్రజల భాగస్వామి కూడా అవసరమని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. వర్షాకాలం మొదలైందని మన ఇల్లు పరిసరాలను ప్రతి క్షణం పరిశుభ్రంగా ఉంచుకోవాలని అందరూ స్వచ్ఛత పాటించాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఎవరు కూడా ఉండకూడదు అన్నారు. అట్టి ఇండ్లను గుర్తించిన వారు తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు వెంకట్ రఘునాథ్, గుణాకర్ మల్లేష్, ప్రశాంత్, వార్డు అధికారులు, సానిటేషన్ జవాన్స్ పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు ప్రభుత్వంపై భరోసా కల్పించాలి



జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి

**శామీర్‌పేట, జూన్ 4 (నిఘా న్యూస్):** రైతుల సమస్యలను పరిష్కారంలో ఎలాంటి అలస్యం చేయకుండా వెను వెంటనే పరిష్కరించి రైతులకు ప్రభుత్వంపై భరోసా కల్పించాలని, భూ భారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణ ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి అన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో భాగంగా బుధవారం మేడ్చల్ మండలంలోని సోమారం గ్రామంలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సును అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు ఆయన సూచించారు. ఈ సదస్సుల ద్వారా రెవెన్యూ రికార్డ్ లను సక్రమంగా నిర్వహించుటకు అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులు ఏవిధంగా ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారని రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆర్జీలను నిర్దేశిత కోడ్‌లలో నమోదు చేయాలని, రైతులకు సంబంధిత డాక్యుమెంట్లను జతచేయాలని తెలియజేయాలన్నారు. ఆర్జీదారులతో సౌమ్యంగా వ్యవహరించాలని, చొరవతీసుకొని వారికి అవసరమైన సలహాలు, సూచనలను అందించాలన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి అయినట్లు దృష్టికి వస్తే తగిన చర్యలు తీసుకోని, ప్రభుత్వ భూముల పరిరక్షణకై పాటుపడాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ అధికారులకు స్పష్టం చేశారు. ఆర్జీలు సమర్పించిన ప్రతి దరఖాస్తుదానికి రశీదులు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోరెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గిర్మాపూర్‌కు బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలి

### రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి



**మహేశ్వరం, జూన్ 4(నిఘా న్యూస్):** నిరుద్యోగ యువతకు ఊతం కాంగ్రెస్ ప్రభుత్వం అని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక పదేండ్లలో గత బీఆర్ఎస్ సర్కారు ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వలేదని ఏడాదికి ఒకటో, రెండో ఇచ్చినా అందులో కొన్ని పేపర్‌లీక్స్‌తో వాయిదాపడుతూ వచ్చాయన్నారు. దీంతో ప్రత్యేక రాష్ట్రంలో నిరుద్యోగుల ఆశలు అడియాశలే అయ్యాయన్నారు. మరోవైపు నిరుద్యోగులకు ఉపాధి తోవ చూపేందుకు గత బీఆర్ఎస్ సర్కారు కార్పొరేషన్ రుణాలను కూడా ఇవ్వలేదన్నారు. అటు ఉద్యోగాలు లేక,ఇటు ఉపాధి లేక నిరుద్యోగుల జీవితాలు నీరుగారి పోయాయని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కంకణం కట్టుకున్నది. ఓవైపు ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తూనే, మరోవైపు నిరుద్యోగులకు ఉపాధి తోవ చూపేందుకు రాజీవ్ యువ వికాసం స్కీమ్‌ను తీసుకొచ్చిందన్నారు. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర వెనుకబడిన వర్గాల యువతకు ఆర్థిక సహాయం అందించాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. గతానికి భిన్నం రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు సాయం అందించేందుకు నిర్ణయించిందన్నారు. 5 లక్షల మంది నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల నిరుద్యోగ యువత హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

# ప్రజా హృదయాలను గెలిచిన నేత మదన్‌లాల్



కారేపల్లిలో మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ సంస్మరణ సభ

**కారేపల్లి, జూన్ 4(నిఘా న్యూస్):** ప్రజాప్రతినిధిగా రాజకీయ నేతగా వైరా మాజీఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ ప్రజల హృదయాలను గెలిచారని వివిధ పార్టీలనాయకులు అన్నారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ సంస్మరణ సభ బుధవారం కారేపల్లిలోని వైఎస్ఎన్ గార్డెన్‌లో మాజీ జడ్పీటీసీ వాంకుడోత్ జగన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతికి నిరంతరం పని చేసిన నాయకుడని కొనియాడారు. పట్టుదలతో అభివృద్ధికి పరితపించేవారని, ఎంత పెద్ద స్థాయి ప్రజాప్రతినిధి, అధికారి వద్దకైనా చొచ్చుకోని పోయి పని చేయించే తత్వం మదన్‌లాల్ దన్నారు. అయన మృతి తీరని లోటన్నారు. సింగరేణి మండలంలో పోడులోకి పేదలను రానీయకుండా ఫారెస్టు నిర్భంధాలు విధిస్తే వామపక్షాలతో పాటు పేదల పక్షాన నిలిచి పోడు జటిలం కాకుండా చూశారన్నారు. అంతకు ముందు దివంగత మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సోసైటీ వైస్ ఛైర్మన్ దారావత్ మంగీలాల్ మాజీ జడ్పీటీసీ ఉన్నం వీరేందర్, రైతు బంధు మాజీ కన్వీనర్ హన్మకొండ రమేష్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర, న్యూడెమోక్రసీ కార్యదర్శి వై.ప్రకాష్, మాస్ లైన్ నాయకులు గుగులోత్ తేజా, మాజీ ఎంపీటీసీలు జడల వసంత,పెద్దబోయిన ఉమాశంకర్, మాజీ సర్పంచులు ఇస్లావత్ బన్సీలాల్, బానోత్ కుమార్, భూక్య రమణ, గుగులోత్ సక్రూ నాయక్, ఉద్యమ నాయకులు జడల వెంకటేశ్వర్లు, భూక్య చందు నాయక్, బీఆర్ఎస్ నాయకులు షేక్ గౌసుద్దీన్ గంగరబోయిన సత్యం, అంబేద్కర్ సంఘం నాయకుడు అదెర్ల రాములు, బానోత్ రాములు, కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ




**వికారాబాద్ జూన్ 4 (నిఘా న్యూస్):** వర్షాకాలం ప్రారంభమవుతుంది కావున జిల్లా పరిధిలోని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ, జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవీందర్ యాదవ్ వెల్లడించారు. మలేరియా మాసోత్సవంను పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ అధ్యక్షతన జిల్లా, నియోజక వర్గస్థాయి మలేరియా వ్యాధి నివారణ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ, జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవీందర్ యాదవ్ మాట్లాడుతూ. దోమ కాటు వలన సంక్రమించే మలేరియా వ్యాధితో పాటు తదితర వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందే స్థావరాలను ముందస్తుగా గుర్తించి తొలగించాలని వెల్లడించారు. మురికి కాలువలలో నీరు నిల్వ ఉండకుండా కృషి చేయాలని పేర్కొన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నీటి నిల్వలలోనే దోమలు వృద్ధి చెందుతాయనే విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించవలసిన అవసరం ఉందని సూచించారు. దోమల నివారణతోనే మలేరియా వ్యాధి నిర్మూలన సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య ఉప విస్తరణ అధికారి వి.శ్రీనివాసులు, సహాయక మలేరియా అధికారి సత్యం, మలేరియా సబ్ యూనిట్ అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ తోనే పేదల సొంతింటి కల నెరవేరుతుంది

**షాద్‌నగర్, జూన్ 4 (నిఘా న్యూస్)ః:** కాంగ్రెస్ తోనే ఇందిరమ్మ ఇళ్ల సహకారం అవుతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త గడపగడపకు వెళ్లి ఇళ్ళు లేని నిరు పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందేందుకు కృషి చేస్తున్నట్లు షాద్ నగర్ కాంగ్రెస్ నాయకులు యాదగిరి యాదవ్ అన్నారు. బుధవారం షాద్ నగర్ మున్సిపల్ పరిధి 22వ వార్డు రతన్ కాలనీలో ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ అయిన పనులను స్థానిక నాయకులు యాదగిరి యాదవ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు కార్యక్రమాన్ని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త గడప గడపకు చేర వేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు మున్సిపల్ అధికారులు ఇచ్చిన ఆదేశానుసారం పనులు త్వరగా పూర్తిచేసుకుని సగర్వంగా సమాజంలో తిరగవచ్చునని ఆమె తెలిపారు. 22వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నాలుగు విడతల్లో ఇంటి నిర్మాణ డబ్బులను లబ్ధిదారులకు చేయించడం జరుగుతుందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుబ్బ శీను, నరసింహులు యాదవ్, కూరగాయల లక్ష్మణ్, కాపర్తి రాజు, కని వేట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలల ఫీజులు నియంత్రించాలి

### నవభారత్ నిర్మాణ యువసేన అధ్యక్షుడు మెట్టు శ్రీధర్



**పటాన్‌చెరు, జూన్ (నిఘా న్యూస్):** ప్రైవేటు కళాశాలు మరియు పాఠశాలల్లో ఫీజులను కట్టడి చేయాలని నవభారత్ నిర్మాన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టుశ్రీధర్ డిమాండ్ చేశారు. డొనేషన్ అడ్మిషన్ పేరుతో ప్రవేటు పాఠశాలలు కళాశాలలు విద్యార్థుల తల్లితండ్రుల నుండి విపరీతమైన డబ్బులు వసూలు చేసి చదువును వ్యాపారంగా మర్చుతున్నారని ఫీజులు యూనిఫాం పుస్తకాల పేర్లతో మోయలేని ఆర్థికభారాన్ని మోపుతున్నారని మెట్టు శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తు ఎవరికి వారు రాసుకున్న చట్టాన్ని అమలు చేస్తున్నారని విద్యా సంవత్సరం ప్రారంభం కావస్తున్న ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయక పోవడం దురదృష్ట కరమని మెట్టుశ్రీధర్ అన్నారు. ప్రవేటు పాఠశాలలు ఇష్టారీతిన ఫీజులు పెంచుతూ లాభార్జన చేస్తున్నాయని విద్యను వ్యాపారంగా మారిస్తే దేశ భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యాహక్కు చట్టాన్ని అమలు పరిచి ప్రవేటు కళాశాలలను పాఠశాలలను కట్టడి చేయాలని మెట్టుశ్రీధర్ కోరారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం కృషి



**హబ్సిగూడ, జూన్ 4 (నిఘా న్యూస్):** హబ్సిగూడ డివిజన్ లోని కామాక్షి పురం, వాసవి నగర్, వెంకట్ రెడ్డి నగర్,కాలనీ లలో డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం వాటర్ వర్క్ అధికారులు, కాలనీ వాసులతో కలిసి ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ పర్యటించారు. ఆయా కాలనీలలో నెలకొన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను జలమండలి అధికారులు పర్యవేక్షించారు. సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని ఈ సందర్భంగా కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆకారపు అరుణ్ పటేల్ మాట్లాడుతూ ఆయా కాలనీలలో నెలకొన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. కొన్ని కాలనీలలో నూతన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ వేయాలని నివాసులు కోరారు. నూతన డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటుకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరనున్నట్లు తెలిపారు .ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రవీందర్, ఇన్స్పెక్టర్ కిషన్,వాటర్ లైన్ మెన్ విజయ్ కుమార్, క్లీనర్ యాదయ్య కాలనీల వాసులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ధ్యేయం

### నిరంతరం ప్రజల మధ్య ఉంటాను

### మాజీ కౌన్సిలర్ రవి నాయక్



**మహేశ్వరం, జూన్ 4(నిఘా న్యూస్):** ప్రజా ప్రతినిధిగా ఉన్నా లేకున్నా నిరంతరం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మాజీ కౌన్సిలర్ రవి నాయక్ అన్నారు. తుక్కుగూడ టౌన్‌లో ఉన్న మంకాలమ్మ టెంపుల్ టెంపుల్ వరకు జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పర్యవేషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రూ.20లక్షలతో ప్రస్తుతం రూ.8 లక్షలతో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు అభివృద్ధి పనులు పూర్తి చేయించడం జరిగిందన్నారు. తుక్కుగూడ టౌన్ ప్రజలకు దృష్టిలో ఉంచుకొని నిధులను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పనులను చేస్తున్నామన్నారు.

## రాపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు

### గొల్లపల్లి ఎమ్మార్వో వరంధన్




**గొల్లపల్లి, జూన్ 4 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారత్ చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని గొల్లపల్లి మండల ఎమ్మార్వో వరంధన్ కోరారు. బుధవారం గొల్లపల్లి మండలం రాపల్లి గ్రామంలో భూభారతి మండల ఎమ్మార్వో వరంధన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. భూ సమస్యలు భూభారతి కార్యక్రమంలో ఆయన వివరించారు. ఇట్టి కార్యక్రమాన్ని రాపల్లి గ్రామస్తులు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో వరంధన్ ఆర్ ఐ అనూష, పంచాయతీ కార్యదర్శి శేకర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు ఏయంసి డైరెక్టర్ కొక్కుల జలంధర్ విజయ్ మారపెల్లి అర్జున్ రాజేందర్ లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేపటి సీఎం సభకు రావాలని ఆహ్వానం

### అసెంబ్లీ స్పీకర్ ను కలిసిన ఆలేరు ఎమ్మెల్యే



**ఆలేరు, జూన్ 4 (నిఘా న్యూస్):** తెలంగాణ శాసనసభ సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అసెంబ్లీ చాంబర్లో కలిసి జన్మదిన శు భాకాంక్షలు తెలిపిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. అదేవిధంగా జూన్ ఆరవ తేదీన సీఎం రేవంత్ రెడ్డి ఆలేరు నియోజకవర్గంలో నిర్వహించే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న సందర్భంగా బహిరంగ సభకు రావాలని ఆహ్వానించారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చే నెంబర్ చౌరస్తాలో నడి రోడ్డుపై ఏర్పడిన గొయ్యి

### వాహనాల రాకపోకలకు ఇబ్బంది



**అంబర్‌పేట, జూన్ 4 (నిఘా న్యూస్):** అంబర్ పేట చే నంబర్ చౌరస్తాలో ప్రధాన రహదారిపై భూమి కుంగిపోయి రోడ్డుపై భారీ గొయ్యి ఏర్పడింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా చే నెంబర్ చౌరస్తాలో వరద నీటి కాలువలు, డ్రైనేజీ కోసం జిహెచ్ఎంసి, జలమండలి అధికారులు పైప్ లైన్లను ఏర్పాటు చేశారు. అయితే పైప్ లైన్లు ఏర్పాటు చేసిన తర్వాత రోడ్డును సరిగా పూడ్చకుండా అధికారులు ఇక్కడ డాంబర్ రోడ్డు ను వేశారు. బుధవారం ఉదయం ఒక్కసారిగా చే నంబర్ చౌరస్తాలో భూమి కుంగిపోయి నడి రోడ్డుపై గొయ్యి ఏర్పడింది. ఈ విషయం గమనించిన అంబర్ పేట ట్రాఫిక్ పోలీసులు గోతిలో ఎవరు పడకుండా చుట్టూ రక్షణగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ గోతి కారణంగా తిలక్ నగర్ నుంచి అంబర్ పేట, జిందా తిలస్మాత్ నగర్ వైపుకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలక్కుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## బక్రీద్ సందర్భంగా మేకలు గొర్రెల అమ్మకాల జోరు



**అంబర్‌పేట, జూన్ 4 (నిఘా న్యూస్):** బక్రీద్ పండుగను పురస్కరించుకొని హైదరాబాద్ నగరంలోని కమేలాలలో మేకలు, గొర్రెల అమ్మకాలు జోరందుకున్నాయి. ఈనెల 7వ తేదీన నిర్వహించే బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు మేకలు, గొర్రెలను కుర్బానీ ఇస్తారు. దీంతో బక్రీద్ సందర్భంగా మేకలు, గొర్రెలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. మహారాష్ట్ర, నాగ్ పూర్, గుజరాత్ తదితర ప్రాంతాలతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి మొండేదారులు మేకలు, గొర్రెలను నగరానికి తీసుకువచ్చి అమ్మకాలు జరుపుతున్నారు. ప్రధానంగా గోల్నాక,కాచిగూడ కమేలా, మలక్ పేట, జియాగూడ, బోయిగూడ, ముషీరాబాద్, టోలిచౌకి, పాతబస్తీ తదితర ప్రాంతాల్లో వ్యాపారులు మేకలు, గొర్రెలను అమ్ముతున్నారు. మామూలు రోజుల్లో రూ.9 వేల లభించే మేక బక్రీద్ సందర్భంగా రూ. 12 వేల రూపాయల ధర పలుకుతుంది. జోడికి రూ. 25 వేల రూపాయల ధర పలుకుతుంది. ధరలు పెరిగినప్పటికీ ప్రజలు బక్రీద్ సందర్భంగా కుర్బానీ కోసం మేకలు, గొర్రెలను ఖరీదు చేస్తున్నారు. దీంతో హైదరాబాద్ నగరంలో రోడ్ల పక్కన ఎక్కడ చూసినా మేకలు, గొర్రెలు దర్శనమిస్తున్నాయి.

# తిరుపతిలో జనసేన సంబరాలు





### హాజరైన ఎమ్మెల్యే శ్రీనివాసులు

**తిరుపతి, జూన్ 4(నిఘా న్యూస్):** కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా జనసేన ఘనంగా వేడకలు నిర్వహించింది. ఎస్టీవి నగర్ లోని గంగమ్మ వీధిలో బుధవారం ఉదయం ముగ్గుల పోటీలు నిర్వహించింది. ముగ్గుల పోటీని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు,ఆయన సతీమణి సత్యవతితో కలిసి పరిశీలించారు. ఈ పోటీల్లో యాభై మంది పాల్గొనగా మొదటి బహుమతిని సూజాతా, రెండో బహుమతిని ప్రమీల, మూడో బహుమతిని దీప్తి, పూజితాలు సంయుక్తంగా గెలుచుకున్నారు. వీరికి బహుమతులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అందచేశారు. కాగా సాయంత్రం తన నివాసం వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దీపాలు వెలిగించి ఎన్డీఏ కేక్ కట్ చేసి జన సైనికులతో సంతోషాన్ని పాలుపంచుకున్నారు. అనంతరం భారీగా బాణా సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. సుపరిపాలనకు ఏడాదైన సందర్భంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు సంక్రాంతి, దీపావళి కలిపి వేడుకగా చేసుకోవాలని పిలుపు నివ్వడంతో వేడుకలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. దీపావళి రోజు నరకాసురుడుని వధించినట్లు ప్రజలు వైసిపికి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా బుద్ధి చెప్పారని ఆయన తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు మంత్రి లోకేష్ లు నెరవేరుస్తూ వస్తున్నారని ఆయన చెప్పారు. అభివృద్ధి, సంక్షేమానికి సమపాళ్ళలో ప్రాధాన్యత ఇస్తూ ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తోందని ఆయన తెలిపారు. సిగ్గూ,శరం లేకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు దినోత్సవం జరిపిందని ఆయన విమర్శించారు.

ఐదేళ్ళ అరాచక పాలన విరగడై ఏడాది కావడంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని ఆయన చెప్పారు. తల్లిని, చెల్లిని దూరం పెట్టి వెన్నుపోటు పొడిచన జగన్‌కు వెన్నుపోటు దినోత్సవం జరిపే నైతికత లేదని ఆయన అన్నారు. వైసిపి పాలనలో తప్పు చేసిన నాయకులు, అధికారులకు చట్టప్రకారం శిక్షలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎన్డీఏ కూటమి పాలనలో తప్పులకు అవకాశం లేకుండా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ లు చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జనసేన నాయకులు రాజారెడ్డి, ఎస్కే బాబు, దూది శివ, తిరుత్తణి వేణు,హరిశంకర్, దినేష్ జైన్, సుభాషిణి, కీర్తన, ఆకుల వనజ, ఆర్కాట్ కృష్ణప్రసాద్, బలరామ్, ప్రభాకర్, సురేష్, యశోద, శ్రీహరి నాయుడు, యశ్వంత్, దుర్గా, వినోద్ రాయల్, పోటుకూరు ఆనంద్, యువరాజ్ రెడ్డి, ఆముదాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సన్న బియ్యాన్ని బయటి వ్యక్తులకు విక్రయించరాదు

### పెబ్బేరులో రేషన్ షాపులను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**పెబ్బేరు, జూన్ 4 (నిఘా న్యూస్):** వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్రంలోని రేషన్ షాపును అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. వెంకటేశ్వర్లు బుదవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా, ప్రజలకు రేషన్ సరుకుల పంపిణీ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా, అదనపు కలెక్టర్ మొదటగా రేషన్ షాపు సమయానికి తెరుస్తున్నారా లేదా అని పరిశీలించారు. అనంతరం, మూడు నెలలకు సరిపడా బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తున్నారా లేదా అని డీలర్‌ను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, పంపిణీ అవుతున్న సన్న బియ్యం నాణ్యత ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా,లబ్ధిదారులకు ఇచ్చిన బియ్యం సరైన తూకంతో ఉన్నాయో లేదో అని తనిఖీ చేయడానికి కొంతమంది అందుకున్న బియ్యం ప్యాకెట్లను స్వయంగా తూకం వేసి సరి చూశారు. బియ్యం నాణ్యతను, డీలర్ వద్ద ఉన్న తూకాలను కూడా వ్యక్తిగతంగా పరిశీలించారు. అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజలకు రేషన్ సరుకులు నాణ్యతగా,సక్రమంగా,సరైన తూకంతో అందేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని,ఇందులో ఎలాంటి లోపాలున్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సన్న బియ్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ బయటి వ్యక్తులకు విక్రయించరాదని డీలర్లను స్పష్టం చేశారు. రేషన్ షాపు డీలర్లు అన్ని రికార్డులను తప్పనిసరిగా సక్రమంగా నిర్వహించాలని, నిబంధనలను పక్కాగా పాటించాలని, లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో, సకాలంలో సేవలు అందించాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీ ప్రజలకు మెరుగైన సేవలందించడంలో భాగంగా జరుగుతుందని ఆయన తెలిపారు.

# పేదలను వంచిస్తున్న పాలకులు

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జానిమియా




**ఖమ్మం, జూన్ 4 (నిఘా న్యూస్):** మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన పాలకులు ప్రజలను వంచించి పాలన సాగిస్తున్నారని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని గిరిప్రసాద్ భవన్లో రఘునాథపాలెం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం పల్లెపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జానిమియా మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని గద్దెనెక్కి రెండేళ్లు కావస్తున్నా ఒక గ్యారెంటీ కూడా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతుభరోసా,రుణ మాఫీ వంటి హామీలు పూర్తి స్థాయిలో ఎవరికి అందలేదని ఆయన తెలిపారు. రాజీవ్ యువవికాసం పేరుతో నిరుద్యోగ యువకులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ఇందిరమ్మ కమిటీలు సూచించిన వారికే మంజూరు చేస్తున్నారని దీని వల్ల అర్హులు నష్టపోతున్నారని ఆయన తెలిపారు. ఎన్నకల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తుందని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందని అందుకే బడ్జెట్లో నిధుల కేటాయింపు తగ్గిస్తూ వస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిపిఐ పోరాటాలు సాగిస్తుందని తెలిపారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సిపిఐ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు, మండల సహాయ కార్యదర్శి బాగం ప్రసాద్, నాయకులు జూల వెంకటేశ్వర్లు, బోడ చిన, రావెళ్ల సురేష్, నాగ, గరిడ రాంబాబు, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆవిర్భావ సభ



**ఇల్లందు, జూన్ 4 (నిఘా న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో సిపిఐ అనుబంధ తెలంగాణ రాష్ట్ర మహిళ సమాఖ్య నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో 71వ ఆవిర్భావ దినోత్సవం ను స్థానిక పార్టీ కార్యాలయం విఠల్ రావు భవన్ నందు నిర్వహించారు. తొలుత సంఘం పతాకాన్ని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కమటం చంద్రకళ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత దేశంలో మొట్టమొదటి సంఘం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ 1954,జూన్ 4 న కలకత్తా మహనగరంలో అక్కడ మహిళలపై జరుగుతున్న హింస రాజకీయలకు వ్యతిరేకంగా మహిళా సంఘం ఆవిర్భవించింది అని అన్నారు. నాడు భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళ లు ఉద్యమించారని, ఈ తెలంగాణ ప్రాంతంలో నైజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు జరిగిన సాయుధ పోరాటంలొ అనేక మంది మహిళలు పాల్గొన్నారని చాకలి ఐలమ్మ, గుజ్జుల సరలాదేవి ఇలా అనేక మంది పాల్గొన్న చరిత్ర మనది అని అన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని నేడు మహిళ లపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని వారు పిలుపు నిచ్చారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నాం అని చెప్పే వారు అన్యాయం చేసారు. అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించాలంటే వారికి నిదులు మంజూరు చేయాలని డిమాండ్ చెసారు. తద్వారా మహిళలు స్వయం ఉపాధితో కుటీర పరిశ్రమలు ఎర్పాటు చెసుకొనే అవకాశం ఉందని, కుట్టు మిషన్లు,బీడి పరిశ్రమ,పాడి పరిశ్రమ, ఇలా అనేక రకమైన ఉపాదులు ఏర్పాటు చెసుకొనే అవకాశం ప్రభుత్వాలు కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చెసారు. మహిళలు తమసాధికారికత కొరకు ఉద్యమించాలని నేడు దేశంలో వివక్షకు గురిఅవుతున్న మహిళల పట్ల కార్యక్రమాలు నిర్వహించాలని అధిక ధరలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని వారు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో కనకతార, మేరిపద్మ, దేవరకొండ సుమతీ, గుగులోత్ సొని, చంద్రావతి, బందం లక్ష్మీ, ఈ.అరుణ, అలుగు సరిత, తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో... ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**శామీర్‌పేట, జూన్ 4 (నిఘా న్యూస్):** 2025-26 విద్య సంవత్సర మునకు గిరిజన బాల,బాలికలకు బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బిఎఎస్)లో ప్రవేశించుటకు గాను (35) సీట్లు మేడ్చల్ మల్కాజిరి జిల్లాకు మంజూరు చేయడం జరిగినది. అందులో 3వ తరగతులో (17) సీట్లు, 5వ తరగతిలో (9) సీట్లు, 8వ తరగతిలో (9) సీట్లు కేటాయించడం జరిగినది. కావున గిరిజన తెగలకు చెందిన లంబాడా, ఏరుకుల ఇతర ఉప - కులాలకు చెందిన విద్యార్థిని / విద్యార్థులకు దరఖాస్తు చేసుకోగలరని కోరనైనది. దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేదీ ఈనెల 17 గా నిర్ణయించారు. దరఖాస్తు ఫారములు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయము, జిల్లా అధికారుల సమీకృత కార్యాలయము, అంతాయపల్లి గ్రామము, శామీర్ పెట్ మండలము, మేడ్చల్ - మల్కాజిరి జిల్లా నందు ఈనెల తొమ్మిదవ తేదీ నుండి 13 వరకు దరఖాస్తు ఉచితముగా పొందగలరు. అట్టి దరఖాస్తుతో పాటు కావలిసిన ధ్రువీకరణ పత్రములు కులము, ఆదాయము, ఆధార్ కార్డు, రేషన్ కార్డు ప్రస్తుతము చదువుచున్న పాఠశాల నుండి పొందిన బోనఫైడ్ సర్టిఫికెట్, పాస్ పోర్ట్ సైజు ఫోటోలను సమర్పించాలి. కావున గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

## స్వచ్ఛతలో ప్రజలు భాగస్వాములు కావాలి

### ఎంఎంసీ కమీషనర్ జ్ఞానేశ్వర్ విజ్ఞప్తి



**బాలాపూర్, జూన్ 4 (నిఘా న్యూస్):** కార్పొరేషన్‌లోని అన్ని కాలనీలలో చేపట్టిన స్వచ్ఛత, పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ ఆర్ జ్ఞానేశ్వర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వంద రోజుల కార్యక్రమంలో భాగంగా 40, 41వ డివిజన్లలో తడి, పొడి చెత్త పై అవగాహన కల్పిస్తూ తడి, పొడి చెత్త, హానికరమైన చెత్త వేర్వేరుగా చేసుకొని స్వచ్ఛ ఆటోలకు అందించాలనీ కోరుతూ ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించారు. నివాస గృహాలలో అనుమతి లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాలను గుర్తించి వాటిపై పన్నులను సవరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ అవగాహన కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్, టౌన్ మిషన్ కో ఆర్డినేటర్, వార్డు అధికారులు, పారిశుధ్య సిబ్బంది, మాజీ కార్పొరేటర్లు, వివిధ కాలనీల వాసులు పాల్గొన్నారు.

## అధికారుల సహకారంతో వార్డు అభివృద్ధికి కృషి



**మేడ్చల్, జూన్ 4(నిఘా న్యూస్):** మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో అధికారుల సహకారంతో ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తొంట సుధాకర్ తెలిపారు. నాలుగో వార్డ్ ప్రధాన రహదారి పైన డ్రైనేజీ నీళ్లు చేరి వాహనదారులకు, పాదచార్లకు ఇబ్బందిగా మారడంతో విషయం తెలుసుకొని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి ని ఫోన్లో సంప్రదించి డ్రైనేజీ క్లీనింగ్ వాహనాన్ని తెప్పించి డ్రైనేజీ నీళ్లు రోడ్డుపైకి రాకుండా మున్సిపల్ సిబ్బందితో క్లీన్ చేయించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా సమస్య చెప్పగానే వెంటనే స్పందించి వాహనాన్ని పంపించినందుకు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## బక్రీద్ సందర్భంగా జంతు వ్యర్థాలను కవర్లలో వేయాలి



**మహేశ్వరం అర్బన్ జూన్ 4(నిఘా న్యూస్):** ఈనెల 7న జరిగే బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అలాగే కుర్బానీ ఇచ్చే సందర్భంలో మిగిలే జంతు వ్యర్థాలను కంపల్స రిగా ప్లాస్టిక్ కవర్లో వేయాలని జల్పల్లి మున్సిపల్ కమిషనర్ వెంక ట్రావు, బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ తెలిపారు. మున్సి పల్ కార్యాలయంలో బాలాపూర్ ఇన్స్పెక్టర్ సుధాకర్, ఎస్ఐ యూసుఫ్ జాని, మున్సిపల్ అధికారులతో కలిసి ముస్లిం సోదరులకు ఇచ్చే ప్లాస్టిక్ కవర్లను ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 7న బక్రీద్ పండుగ సంధర్భంగా ముస్లిం సోదరులు కుర్బానీ ఇచ్చే సందర్భంలో జంతు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్లాస్టిక్ కవర్లలో వేసి మున్సిపల్ అధికారులు చూయించిన ప్రదేశాలలో వేయాలన్నారు. ఎక్కడపడితే అక్కడ వేస్తే పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతాయి అన్నారు. ముస్లిం సోదరులు గమనించి జంతు వ్యర్థాలను తప్పనిసరిగా ప్లాస్టిక్ కవర్లో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారి జ్యోతి, ఎన్విరాన్మెంట్ అధికారి శ్రీనివాస్, జవాన్లు కుమార్, హరినాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తూప్రాన్ మున్సిపల్ 2వ వార్డ్ బిఆర్ఎస్ అధ్యక్షులు చింతల దశరథ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ను కలిసి శాలువాతో సన్మానించారు. బి ఆర్ ఎస్ శ్రేణులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు.
– తూప్రాన్, జూన్ 4 (నిఘా న్యూస్):

## ఈటలను సన్మానించిన బిజెపి నేతలు



**మేడ్చల్, జూన్ 4(నిఘా న్యూస్):** మల్కాజిగిరి ఎంపీగా గెలిచి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం ఈటల రాజేందర్ ను మేడ్చల్ బిజెపి నాయకులు మాజీ సర్పంచ్ ఎల్లంపేట్ జగన్ గౌడ్ ఆధ్వర్యంలో ఈటల రాజేందర్ ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్ దాస్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి రాఘవ రెడ్డి, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి మహేష్, బిజెపి డబిల్ పూర్ శక్తి కేంద్రం ప్రముఖ్ రవీందర్ ముదిరాజ్, రమణ రెడ్డి సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి సీఐ రమేష్‌కు సన్మానం



**భువనగిరి, జూన్ 4 (నిఘా న్యూస్):** భువనగిరి టౌన్ నూతన సీఐ రమేష్‌ని ఆఫీసులో కలిసి పుష్పగుచ్చం అందజేసి సన్మానించిన బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లగొర్ల మోదీరాందేవ్ వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ,బీసీ అగ్రవర్ణ పేదలపై పై జరుగుతున్న దాడులను అరికట్టాలని, త్వరలో ఎలక్షన్స్ ఉన్నందున రాజకీయ ఒత్తులకు లోన్ అవుతున్నందున టౌన్‌లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలని మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని అందరికీ సమాన న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో శ్రీరామ్ శరత్, కంతం కిషోర్ పటేల్, నర్సింగ్ రావు విజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక డివిజన్లుగా విలీన గ్రామాలు




**కరీంనగర్ రూరల్, జూన్ 4 (నిఘా న్యూస్):** కరీంనగర్‌కి ఆనుకొని ఉన్న చుట్టుపక్క గ్రామాలు కరీంనగర్లో విలీనమైన విషయం తెలిసినదే. ఇందులో భాగంగాకరీంనగర్ పాలన సంస్థలు నగర శివారు గ్రామంలో విలీన గ్రామాలతో కలిసిన 66 డివిజన్ గా ప్రభుత్వం ముసాయిదా విడుదల చేసింది. గోపాలపూర్, దుర్షేడ్ 3 వ డివిజన్, బొమ్మకల్, ఆటోనగర్, గుంటూరు పల్లి, 4 వ డివిజన్. గాంధీనగర్, చింతకుంట, పద్మనగర్, 12వ డివిజన్. చింతకుంట పూర్తిగా 13వ డివిజన్. మల్కాపూర్ లక్ష్మీ నగర్ 14వ డివిజన్. కొత్తపల్లి 15 16వ డివిజన్లుగా చేశారు.

## వెంకన్న స్వామి హుండీ ఆదాయం మూడున్నర లక్షలు



**మల్కాజిగిరి, జూన్ 4 (నిఘా న్యూస్):** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. ఎండోమెంట్ పర్యవేక్షణ అధికారి, మోహన్ రెడ్డి సమక్షంలో లెక్కించగా 69 రోజులకు గాను రూ 3,56,940 రూపాయల ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎ బి రవీంద్ర రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ బి రవీంద్ర రెడ్డి, ప్రధాన అర్చకులు ముడుంబై వేంకట రమణా చార్యులు,అర్చకులు తులసి వెంకట రమణా చార్యులు, క్లర్క్ సంద్రా సుధాకర్, దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సానాధి శంకర్, హేమంత్ కుమార్, శ్రీధర్ (రాజు) రవీంద్ర రెడ్డి, శ్రీకాంత్, పద్మావతి భక్తులు, రత్నమాల, సూర్య కుమారి, లలిత, పద్మ, నాగ రాజు, అన్నపూర్ణ, స్వరాజ్య లక్ష్మీ, నాగమల్లేశ్వరి, వరలక్ష్మీ, దివ్య ధనలక్ష్మి, సీతాలక్ష్మి, గిరీష్, గాంధీ, సత్యనారాయ ణ తదితరులు పాల్గొన్నారు.

## చింతూరులో వాహన తనిఖీలు

**చింతూరు, జూన్ 4 (నిఘా న్యూస్):** చింతూరు, ఎర్రం పేట లలో ప్రాంతంలో జిల్లా యస్పి.అమిత్ బర్గర్, చింతూరు ఏస్పీ పంకజ్ కుమార్ మీనా, సిఐ దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు వాహనాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అక్రమ గంజాయి రవాణా నిరోధానికి, లైసెన్స్ లేని మైనర్ బాలురు, సీ బుక్కులేని వాహనాలు వేసుకొని తిరిగితే కేసులు తప్పవని ఎస్ఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రథమ తప్పుగా భావించి విడిచిపెట్టారు. ఆటో లకు అన్ని డాకుమెంట్స్ తప్పని సరిగా ఉండాలన్నారు. తనిఖీ లలో యస్ఐ. రమేష్, కృష్ణ, ఎయస్ ఐ. మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



# కల్తీలను అరికట్టి బ్యాంకు రుణాలను అందజేయండి

### ఎమ్మార్వో కార్యాలయం ముందు ఏఐకేఎంఎస్ ధర్నా

**యాదగిరిగుట్ట, జూన్ 4 (నిఘా న్యూస్):** ఖరీఫ్ సీజన్లో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కల్తీ విత్తనాలు ఎరువులు పురుగు మందులను అరికట్టాలని, బ్యాంకు రుణాలు ఇవ్వాలని కోరుతూ యాదగిరిగుట్ట మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయం ముందు ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి మెమోరడం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐ కేఎంఎస్ జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు కళ్లెపు అడవయ్య బెజ్జాడి కుమార్ పాల్గొని మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది రైతాంగ సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన రైతాంగ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉంది. వ్యవసాయ శాఖ అధికారులు ఎలాంటి వ్యవసాయ ప్రణాళిక లేకుండా గత ఐదు సంవత్సరాల నుండి కొనసాగిస్తున్నారు. దీంతో రైతాంగం ఏ భూముల్లో ఏ పంటలు వెయ్యాలో తెలియక గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా మార్కెట్లో నకిలీ విత్తనాలు ఎరువులు, పురుగు మందులు ఉండడంతో రైతాంగ కొనుగోలు చేసి మోసపోతుంది సంవత్సరంలో కనీసం ఐదు నుండి 6 లక్షల ఎకరాల వరకు దిగుబడి తగ్గి నష్టపోతున్నారు. రైతాంగకు కావలసిన విత్తనాలు 20 శాతం మాత్రమే ప్రభుత్వం రంగ సంస్థల ద్వారా అందజేస్తుంది దీనిని ఆసరాగా చేసుకుని ప్రైవేటు కార్పోరేట్ కంపెనీలు విచ్చలవిడిగా నాణ్యతలేని విత్తనాలను ఉత్పత్తి చేస్తున్న వీటిపై రైతాంగం ఆధార పడుతున్నార. నాణ్యమైన విత్తనాలను రైతాంగానికి అందించాలని కలితి విత్తనాలను అరికట్టాలని విత్తనాలపై కార్పొరేట్ బహుళజాతి కంపెనీలు ఆధిపత్యం అరికట్టాలని తెలిపారు. 2014 నుండి విచ్చలవిడిగా రాజకీయ పార్టీలు రుణమాఫీల ప్రకటనలు చేయడంతో బ్యాంకు రుణాలను ఇవ్వాలని ప్రభుత్వాలు మొరపెట్టుకున్న బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. చిన్నా సన్న కారు రైతులందరితో పాటు భూములు ఉన్న రైతులందరికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలని కౌరు రైతులతో పాటు మొత్తం రైతాంగానికి ఖరీఫ్ సీజన్లో ఎరువులు విత్తనాలు పురుగుల మందులతో పాటు బ్యాంకు రుణాలు వ్యవసాయ పరికరాలు ఇవ్వాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా ఇవ్వాలని ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని తెలంగాణలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ,ఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శులు పిన్నపురెడ్డి రాఘవరెడ్డి ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు పద్మ, జిల్లా నాయకుడు పంజాల మురళి, బాల్రెడ్డి వంగాల మౌసన్ రెడ్డి బద్దం వెంకటేష్ సుంచు రాములు గండికోట దుర్గయ్య వెంకటేష్ నరసింహులు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.




# జంతు వధపై నిబంధనలు పాటించాలి

### ముస్లిం పెద్దలతో పోలీసులు పశు వైద్యాధికారుల సమావేశం



**జగిత్యాల, జూన్ 4 (నిఘా న్యూస్):** బక్రీద్ పండుగ నేపథ్యంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ జి. బక్కయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ అధ్యక్షతన ఏరియా పశు వైద్యశాల మెట్ పల్లి లో ముస్లిం మత పెద్దలతో ముందస్తుగ పశువధ గురించి, వాటికీ సంబంధించిన నియమాలు గురించి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బక్కయ్య మాట్లాడుతూ గోవధ అనేది చట్ట రీత్యా నేరం అక్రమంగా గోవులను రవాణా చేసిన వధించిన చట్టపరమైన చర్యలు ఉంటాయని అలాగే ఆంధ్రప్రదేశ్ తెలంగాణ గోవధ నిషేధ పశు సంరక్షణ చట్టం 1977 ప్రకారం గోవులను దూడలను (మగవి,ఆడవి) ఎట్టి పరిస్థితులలో ఉద్దేశ్యపూర్వకంగా చంపకూడదు.ఎద్దు, దున్న, గేదె మొదలైన వాటిని చంపాలంటే వాటి వయస్సు ఖచ్చితంగా 14 సంవత్సరాలు దాటి ఉండాలి. అలాగే వ్యవసాయానికి, బ్రీడ్ డెవలప్మెంట్ కి పూర్తి నిరుపయోగంగా వున్నాయని ప్రభుత్వము నియమించిన పశు వైద్యాధికారి ధ్రువీకరించిన సర్టిఫికెట్ ఇవ్వాలి. ప్రభుత్వ పశువైద్యాధికారి సర్టిఫికెట్ ఉన్నప్పటికీ వాటిని ప్రభుత్వ అనుమతి వున్న కబేళా (పశు వధశాల)లలో మాత్రమే వధించాలన్నారు. ఇండ్లల్లో ఎక్కడ పడితే అక్కడ పశువులను వధించడం మాంసాన్ని విక్రయించడం నేరమని, కాగ్నిజబుల్ నేరం కింద వస్తుందన్నారు. అక్రమ గోవుల రవాణ వాహనాలు మనకు కనబడగానే వాటిని ఆపి 100కి కాల్ చేసి, పోలీస్ వారికి తప్పనిసరిగా సమాచారాన్ని ఇవ్వాలి. పట్టుకున్న గోవులను పోలీసులు సురక్షితంగా రిజిస్టర్ అయిన గోశాలకు తరలించాలని, అలాగే అక్రమ రవాణ చేస్తున్న వారిమీద అమ్మినవారు, కొన్నవారి మీద శిక్ష పడేలా కేసు నమోదు చేయాలని తెలిపారు. తదనంతరం స్థానికంగా ఉన్న పశువధశాలను తనిఖీ చేయడం జరిగింది. కావున పశువుల విక్రయదారులు వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను తప్పకుండా పాటించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గంగప్రసాద్, డాక్టర్ నరేష్ రెడ్డి, డాక్టర్ అశోక్, డాక్టర్ మనీషా పటేల్, పశువైద్య సహాయక సిబ్బంది మురళి, రాజేష్, ఖాజా ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్చార్జిలకు బీమా సౌకర్యం



**వరంగల్, జూన్ 4 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో డిజిటల్ ప్రచారానికి, పార్టీ కార్యాచరణను సామాజిక మాధ్యమాల్లో సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో పని చేస్తున్న సోషల్ మీడియా కోఆర్డినేటర్లకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన సోషల్ మీడియా కో ఆర్డినేటర్లకు రాష్ట్ర సోషల్ మీడియా విభాగం, టిజిటి ఎస్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సతీష్ ఆధ్వర్యంలో ఇన్సూరెన్స్, ఐడెంటిటీ కార్డులు మరియు ప్రత్యేక డైరీలను మంజూరు చేశారు. ఈ కార్యక్రమం వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మార్గదర్శనంలో, వరంగల్ పార్లమెంట్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ మొహమ్మద్ నేహాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది.

ముఖ్య అతిథులుగా పిసిసి సభ్యులు శ్రీనివాస్, ఈ.వి. శ్రీనివాస్ రావు హాజరై, కోఆర్డినేటర్లకు ఇన్సూరెన్స్ పత్రాలు, గుర్తింపు కార్డులు, డైరీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోషల్ మీడియా అనేది ఈ కాలంలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి చేరవేసే ప్రధాన వేదికగా మారింది. ఈ విభాగంలో పనిచేసే యువతను గుర్తించి, వారికి గుర్తింపు కల్పించడం అవసరం. ఈ కార్డులు ద్వారా వారికి మానవీయ భద్రత కల్పించడంతో పాటు, సమాజంలో గౌరవనీయమైన స్థానం ఏర్పడుతుంది సోషల్ మీడియా వాలంటీర్లలో కొత్త ఉత్సాహాన్ని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు సోషల్ మీడియా కోఆర్డినేటర్లకు అందించడానికి పార్టీ కట్టుబడి ఉందని నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి బైరబోయిన రమేష్ యాదవ్, పశ్చిమ సోషల్ మీడియా పలు డివిజన్ ల ఇంచార్జ్ లు బారాబోయిన రమేష్, రోషన్ గైక్వాడ్, సాయికృష్ణ, సురేందర్, భరత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థికి వెస్సో ట్రస్ట్ ఆర్థిక సాయం




**మల్కాజిగిరి, జూన్ 3 (నిఘా న్యూస్):** ఓ నిరుపేద ప్రతిభగల విద్యార్థి చదువు కోసం 'వెస్సో ట్రస్ట్' రూ.70వేల ఆర్థిక సహాయం చేసింది. వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన నాగలక్ష్మి గత 9తొమ్మిది సంవత్సరాలుగా పనిమనిషి. నాగలక్ష్మి తన ఇద్దరు కుమారులను పోషించేందుకు, ఏపీ ట్రాన్స్కోలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, టి బాబు రాధాకృష్ణ ప్రసాద్ ఇంటితో పాటు మరి కొందరి ఇళ్లలో పని చేస్తున్నారు. ఆమె పెద్ద కుమారుడు ప్రతాప్(15) తెలివైనవాడు, కష్టపడే విద్యార్థి. అతను పదో తరగతిలో 600 కు 565 మార్కులతో పూర్తి చేశాడు. ప్రతాప్ ఐఐటీ మెయిన్స్‌కు సిద్ధమవాలని ఆశపడుతున్నాడు. అయితే, ప్రవేశానికి కావలసిన ఖర్చు నాగలక్ష్మి వద్ద లేవు. రాధాకృష్ణ ప్రసాద్ సహాయంతో విజయవాడలోని శరత్ చంద్ర కాలేజీలో చేర్పించారు. ప్రతాప్ ప్రతిభను, ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (పుస్తకాలు, యూనిఫామ్ సహా) కోసం కళాశాల యాజమాన్యం రూ.71వేల రాయితీ ఫీజు ప్రకటించింది. ఇప్పటికే రాధాకృష్ణ ప్రసాద్ ఈ కాలేజీ కి రూ.10 వేలు అడ్వాన్స్ చెల్లించి, ప్రతాప్‌కు బ్రిడ్జ్ కోర్సు మొదలు పెట్టే అవకాశం కల్పించారు. ఇప్పుడు మిగిలిన రూ.61వేల కోసం రాధాకృష్ణ ప్రసాద్ వెస్సో ట్రస్ట్ ను సంప్రదించారు. ప్రతాప్‌కు సహాయం చేయమని వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావును కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు ట్రస్టీలు తమ స్నేహితుల సహకారంతో ప్రతాప్ చదువుకు సహాయ పడడానికి చొరవ తీసుకొన్నారు. వెస్సో ట్రస్ట్ కోశాధికారి టేకి వివిడి వరప్రసాద్, టి.బి.రాధాకృష్ణ ప్రసాద్, కాలేజ్‌లో పర్య టించి దాతల నుండి రూ.70వేలు సేకరించారు. దీనిలో రూ 61వేలు శరత్ చంద్ర కాలేజ్ కు ట్యూషన్ ఫీజు, పుస్తకాలు, యూనిఫామ్ నిమిత్తం చెల్లించారు. మిగిలిన విద్యార్థి భవిష్యత్తు అవసరాలకు (పరీక్ష ఫీజు, ఇతరాలకు) చెల్లిస్తామని వెస్సో కోశాధికారి వరప్రసాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థి ఉజ్వల భవిష్యత్ కోసం చేయూత నిచ్చిన దాతలు అందరికి పేరుపేరునా వెస్సో ట్రస్ట్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## బాలికలకు అమృత మిల్లెట్స్ అందజేసిన సిడిపిఓ



**ఇల్లందు, జూన్ 4 (నిఘా న్యూస్):** ఇల్లందు మున్సిపాలిటీ 15 వ వార్డు వెంగళరావు కాలనీ అంగన్వాడి సెంటర్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ అమృత మిల్లెట్స్ చిక్కి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపివో అరుణ మాట్లాడుతూ, ఆడపిల్లలకు శక్తినిద్దాం ఆరోగ్య తెలంగాణను నిర్మిద్దాం, అనే నినాదంతో ప్రత్యేక పోషకాహార పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం బాలికల్లో రక్తహీనతను నివారించేందుకు ఇందిరమ్మ అమృత పేరిట ఈ పథకాన్ని అమలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమానికి 14 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల వరకు బాలికలకు మిల్లెట్స్ చిక్కి ఇవ్వటం జరిగినదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు సిడిపిఓ అరుణ, సూపర్వైజర్ రోహిణి, అంగన్వాడి టీచర్ శారద, ఆయా రజిత, వీరితో పాటు మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి నివారణకు కృషి

### మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్



**బోడుప్పల్, జూన్ 4 (నిఘా న్యూస్):** బోడుప్పల్ నగరపాలక సంస్థ 21వ డివిజన్ మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్ డివిజన్ పరిధిలో మంచినీటి పైప్లైన్ జంక్షన్ లను ఏర్పాటు చేయవలసిందిగా హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి జీఎం సునీల్ కుమార్ ను కోరగా, వాటిని మేనేజర్ మమత వారి బృందంతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో మంచినీటి సరఫరాకి అంతరాయం లేకుండా చూస్తామని, మిగులు పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎలిగొండయ్య, సూపర్వైజర్ అనిల్, లైన్మెన్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణి



**కారేపల్లి, జూన్ 4(నిఘా న్యూస్):** కారేపల్లి మండలంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలని పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుధవారం పంపిణి చేశారు. భజ్యాతండా, పాటిమీదిగుంపులో జరిగిన కార్యక్రమాలలో లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. ఇది మొదటి విడుత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితా మాత్రమేనని, ప్రతి ఒక్క అర్హుల్కైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వటమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హటకర్ రాంబాబు, అజ్మీర హేమ్లానాయక్, అజ్మీర నారాయణ, వాంకుడోత్ హనుమంతరావు, బానోత్ బాబు, సురేష్, కిషోర్, గుగులోత్ బాలకృష్ణ, తాటి నాగేశ్వరరావు, ఎస్‌కె.జాన్, బానోత్ విజయ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన పెబ్బేరు బిఆర్ఎస్ నేతలు

**పెబ్బేరు, జూన్ 4 (నిఘా న్యూస్):** పెబ్బేరుకు చెందిన దాదాపు 30మంది పార్టీ శ్రేణులు, మహిళలు బుధవారం కాంగ్రెస్ నాయకులు గంధం ఉత్తమ్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వీరికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మహిళాభివృద్ధికి, నిరుపేదల అభ్యున్నతికి పాటుపడి ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులమై బుదవారం పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో పెబ్బేరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, పట్టణ అధ్యక్షులు వెంకట్రాములు, నాయకులు గంధం రాజశేఖర్, దయాకర్ రెడ్డి,భాను ప్రకాష్ రెడ్డి, సురేందర్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడ్, వినయ్ కుమార్, పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.





## రోడ్లపై పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు : సీఐ

**అశ్వారావుపేట, జూన్ 4 (నిఘా న్యూస్):** రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ పార్కింగ్ చేసి ట్రాఫిక్ కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ పింగిలి నాగరాజు హెచ్చరించారు. బుధవారం అశ్వారావుపేటలోని పలు వీధుల్లో తిరిగి వాహనదారులు పలు సూచనలు చేశారు. జీవమణి హాస్పిటల్ రోడ్డులో ఉన్న దుకాణదారులకు అవగాహన కల్పించారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై అడ్డంగా పార్కింగ్ చేస్తే వాహనదారుడితో పాటు ఆ దుకాణదారుడి పై కూడా కేసులు తప్పవని, దుకాణదారులు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ



**అశ్వారావుపేట, జూన్ 4 (నిఘా న్యూస్):** అశ్వారావుపేట మండలం ఉట్లపల్లి పంచాయతీలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను సెక్రటరీ రజిని పంపిణీ చేశారు. ఈ పథకం ద్వారా నిరుపేదల సొంతింటి కల సాకారమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు సత్యం, రామక్రిష్ణ, సాధు జోషి,వేముల అశోక్,కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ కొవ్వసి దుర్గారావు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే జారే



**అశ్వారావుపేట, జూన్ 4 (నిఘా న్యూస్):** భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం భూభారతి ద్వారా సువర్ణ అవకాశాన్ని కల్పించిందని, భూ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న రైతులు భూభారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు అందజేసి సమస్యలు పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పిలుపునిచ్చారు. అశ్వారావుపేట మండలంలోని జమ్మిగూడెం, గుమ్మడివల్లి, కోయ రంగాపురం పంచాయతీలో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఎమ్మెల్యే జారే హాజరై, అధికారులకు , రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్వి రామకృష్ణ, ఆర్ఐ కృష్ణ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మయ్య, రికార్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

## రంగాపురంలో రెవెన్యూ సదస్సు

### సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి తహసిల్దార్ మురళి గౌడ్



**పెబ్బేరు, జూన్ 4 (నిఘా న్యూస్):** భూ భారతితో ప్రజలకు మేలు జరుగుతుందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు బి.రాంచంద్రారెడ్డి తెలిపారు. పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామంలో రెండో రోజు భూ భారతి రెవెన్యూ సదస్సు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు బి.రాంచంద్రారెడ్డి, తహసీల్దారు మురళీ గౌడ్ మాట్లాడుతూ భూభారతి ద్వారా భూముల పాలనను మరింత పారదర్శకత కోసం భూసమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగా రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుందని అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు బి.రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ గతంలో అధికారులు చేసిన తప్పుల వల్ల భూ సమస్యలు ఏర్పడ్డాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జ్యోతి, రెవెన్యూ అధికారులు సురేష్, కిరణ్, వెంకటలక్ష్మి, వెంకటయ్య గ్రామ కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పాటపేట గంగమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే



**పలమనేరు, జూన్ 4(నిఘా న్యూస్):** బైరెడ్డిపల్లి మండలం పాతపేట గ్రామంలో జరిగిన గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఆయన అమ్మవారిని దర్శించుకున్నారుఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం తెలియజేయగా జాతర కమిటీ సభ్యులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందించి సత్కరించారు. వర్షాలు మరింత విరివిగా కురిసే పంటలు బాగా పండాలని, అందరూ బాగుండాలని ఈ సందర్భంగా అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం శెట్టితో పాటు బైరెడ్డిపల్లి వీ,కోట మండల నాయకులు రంగనాథ్, రాంబాబు, ధీరజ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో కొత్త రాజకీయాలకు తెరలేపిన కూటమి

- కూటమి విధానాలనే రేపు అధికారంలోకి వచ్చాక అమలు చేయడం ఖాయం
- శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు రెడ్డి



**శ్రీకాళహస్తి, జూన్ 4 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తిలో వైసిపి పిలుపుమేరకు బుధవారం వెన్నుపోటు దినం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తదితరులు. అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ర్యాలీగా వెళ్లి ఆర్డిఓ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ శాంతికి అర్జీ ఇచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికారం చేపట్టడం లక్ష్యంగా చంద్రబాబు నాయుడు మోసపూరిత హామీలను గుప్పించారు. సూపర్ సిక్స్ అంటూ బూటకపు మేనిఫెస్టోను తీసుకువచ్చారు. చివరికి అధికారం చేపట్టిన మరుక్షణం నుంచి ఆర్థిక స్థితి బాగోలేదంటూ మానిఫెస్టోను మూలన పడేశారు. అభివృద్ధిని అటకెక్కించే సంక్షేమ పథకాలను గాలికి వదిలేశారు. ప్రధానంగా మహిళా శక్తి పేరుతో ఆడపడుచులకు ఇచ్చిన హామీలను తల్లికి వందనం, ఆడబిడ్డ నీది, ఉచిత బస్సు వంటి పథకాలను ఇస్తానని అక్క చెల్లెమ్మలకు వెన్నుపోటు పొడిచాడు. ప్రభుత్వాలు తప్పు చేసిన, సామాన్య ప్రజలకు అన్యాయం జరిగినా స్పందించి ప్రశ్నిస్తానన్నా పవన్ కళ్యాణ్ ఏమయ్యారు.కూటమి ప్రభుత్వం పాలన ఏడాది గడుస్తున్న ప్రజలకు చిల్లి గవ్వ చేతికిందలేదు. ప్రజల పక్షాన నిలుస్తున్న వారిపై దాడులు దౌర్జన్యాలు కేసులు అరెస్టులతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. శ్రీకాళహస్తిలో ఇసుక మాఫియా విపరీతంగా పెరిగిపోయి, ఉచిత ఇసుక అంటూ అధరగొట్టి పచ్చ ముఠాకు ప్రకృతి వనరులను అప్పగించేశారు. సిసి రోడ్లు, భవనాలు, పంచాయతీ పనులు, ఆర్ అండ్ బి,గనుల కాంట్రాక్టు వంటి పనులను తెలుగు తమ్ములకు కట్టబెట్టి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టారు. శ్రీకాళహస్తిలో ఎప్పుడూ లేనివిధంగా కొత్త రాజకీయాలకు తెరదీశారు. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఎన్నికల వరకే ప్రత్యర్థులుగా చూసే వాళ్ళము ఆ తర్వాత ప్రతి ఒక్కరికి పనిచేసి అందరూ బాగుండాలని కోరుకున్నాము. కానీ నేడు శ్రీకాళహస్తిలో ఆ పరిస్థితి లేదు. ఇలాగే ఓ నూతన వరవడికి శ్రీకారం చుడితే రేపు అధికారంలోకి వచ్చేది మేమే అప్పుడు నేను చెప్పినా కూడా మా కార్యకర్తలు నా మాట వినే పరిస్థితి ఉండకపోవచ్చని అన్నారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, కంట ఉదయ్ శరవణ సురేష్ వయ్యాల కృష్ణారెడ్డి, ఓడూరు గిరిధర్ రెడ్డి,బర్రి సుదర్శన్ రెడ్డి,గున్నేరి కిషోర్ రెడ్డి,కూనాటి రమణయ్య యాదవ్,గంగారి రమేష్, చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి,హరి ప్రసాద్ రెడ్డి,పగడాల రాజు, ప్రభాకర్ వైయస్సార్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బంగారమ్మ దేవాలయంలో బీజేపీ శ్రేణుల పూజలు

### ఎంపీగా రఘునందన్ రావు ఏడాది కాలం పూర్తి



**మనోహరాబాద్, జూన్ 4 (నిఘా న్యూస్):** మెదక్ ఎంపీ రఘునందన్ రావు మెదక్ లోక్ సభ స్థానం నుంచి ఎంపీగా గెలుపొంది సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాల్లకల్ పరిధిలోని శ్రీ వనదుర్గ బంగారమ్మ ఆలయంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ ఎంపీగా రఘునందన్ రావును గెలిపించిన మెదక్ లోక్ సభ నియోజకవర్గ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీజీ ఆదేశాలు రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి సూచనలతో నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్న రఘునందన్ రావుకు జాతీయ అధ్యక్షులు నడ్డా, హోం శాఖ మంత్రి అమిత్ షా ల సలహా మేరకు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కంకణ బద్ధులై ముందుకు సాగుతున్నారన్నారు. అహర్నిశలు ప్రజల్లోనే ఉంటూ ప్రజల ఆకాంక్షల నెరవేరుస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల మండనలు పొందుతున్న రఘునందన్ రావుకు నిండు నూరేళ్లు భగవంతుడు ఆశీస్సులు ఉండాలనీ అత్యున్నత స్థాయి పదవులు కల్పించాలని ఆ భగవంతున్ని బీజేపీ నాయకులు కోరుకున్నారు. రాష్ట్ర నాయకులు పురం మహేష్ ముదిరాజ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కమ్మరి నరేందర్ చారి కాళ్లకల్ గ్రామ అధ్యక్షులు కొత్తూరి మల్లేష్ ముదిరాజ్, మండల నాయకులు ఎర్రోళ్ల కృష్ణ ఎల్. ప్రభాకర్ గౌడ్, సదాశివులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో వాలీబాల్ ఆడిన మంత్రి పొంగులేటి

### కూసుమంచి మండలం నర్సింహులగూడెంలో పొంగులేటి ఆటవిడుపు



**కూసుమంచి, జూన్ 4(నిఘా న్యూస్):** ఏరా పిల్లలు వాలీబాల్ ఆడుతున్నట్టునారు నాకో ప్లేస్ ఇవ్వండి నేనూ ఆడతా అంటూ తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులతో కాసేపు ఆట ఆడారు. కూసుమంచి మండల పర్యటనలో భాగంగా గైగోల్లపల్లి గ్రామానికి వెళ్ళి తిరుగు ప్రయాణంలో పాలేరు గ్రామానికి వస్తున్న సమయంలో మార్గంమధ్యలోని నర్సింహులగూడెం గ్రామంలోని మైదానంలో వాలీబాల్ ఆడుతూ కనిపించిన విద్యార్థులను చూసి తన కాన్వాయ్ ను ఆపారు. నేనూ ఆడతా నాకో ప్లేస్ ఇవ్వండి అంటూ కాసేపు వారితో కలిసి వాలీబాల్ ఆడారు. ఆట అనంతరం వారితో కాసేపు ముచ్చటించారు. ఒక్కొక్క విద్యార్థిని పలకరించి ఏం చదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు కూసుమంచిలో మంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేశామని నాణ్యమైన విద్యను అందిస్తామని దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే చదువుకోవాలని సూచించారు. డ్రగ్స్ కు యువత బానిస అవ్వొద్దని, విక్రయాలు జరిపే వారి వివరాలు తెలిసినా డ్రగ్స్ కు బానిసైన వారు ఎవరైనా ఉన్నా తన దృష్టికి తీసుకుని రావాలని వారితో అన్నారు. చదువుతో పాటు ఆట కూడా ముఖ్యమని చెప్పి కొత్త వాలీబాల్ క్రికెట్ కిట్ కొనుక్కోమని వాటికి అయ్యే ఖర్చుకు నగదును టీమ్ సభ్యులకు అందించారు. స్వయంగా మంత్రే వచ్చి వారితో వాలీబాల్ ఆడటంతో అక్కడి విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

## మధిరలో తిరంగా ర్యాలీ




**మధిర,జూన్ 4 (నిఘా న్యూస్):** ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో ఇండియన్ ఆర్మీకి మద్దతుగా దేశ వ్యాప్తంగా తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం మధిర పట్టణంలో బిజెపి శ్రేణులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయవాదులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, మతమడిగి 27మందిని పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్ర ముఖలను ఆపిరేషన్ సిందూర్ పేరుతొ శేత్రు శిభిరాను ద్వాంసం చేసి,ఉగ్రముఖలను మట్టు పెట్టిన భారత త్రివిధ దళాలుకు వందనం తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఏ.కొండలరావు,గల్లా సత్యనారాయణ, నెల్లూరు కోటేశ్వరరావు, ఎస్.కె మహమ్మద్ ముజాయిదిన్ తదితరులు ప్రసంగించారు. ఈ ర్యాలీలో జాతీయ వాదులు ఏలూరి నాగేశ్వరావు,చావా వేణు, చేకూరి కృష్ణారావు,రషీద్, గాలిమ్,కురువెళ్ల కృష్ణ, చెరుగుడ్ల నరసింహారావు, పల్లపోతు కృష్ణారావు, వంగవీటి రాజశేఖర్,గద్దల నాగరాజు ఆర్మీ,చిలివేరు సాంబశివరావు,వేణు గోపాలరెడ్డి,చంద్రశేఖర్, మండదపు సుబ్బారావు, జ్వాలా నరసింహారావు, రామిశెట్టి నాగేశ్వరావు, శివరాజు సుమంత్,గద్దం శ్రీహరి, కృష్ణారావు, నూతక్కి నరసింహారావు, కృష్ణ రెడ్డి,కుంచం కృష్ణారావు, మార్సకట్ల స్వర్ణకర్,పాపట్ల రమేష్,రవీంద్ర, సాయి, రామకృష్ణ,వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# యోగాంధ్రలో భాగంగా యోగ పోటీలు




**బెల్లంకొండ, జూన్ 4 (నిఘా న్యూస్):** మండల కేంద్రంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల నందు యోగాంధ్రలో భాగంగా విద్యార్థులకు 10 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల పిల్లలకు యోగాలో సూర్య నమస్కారముల పోటీ నిర్వహించారు. యోగా పోటీలకు సిద్ధం చేయడం జరిగింది. ఎంపీడీవో శ్రీనివాస నాయక్ ఆధ్వర్యంలో మండల యోగా పోటీలను నిర్వహించడానికి సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ అన్ని మండలంలోని సచివాలయాలు నుండి అన్ని యోగ పోటీలకు అభ్యర్థులను ఎన్నిక చేసుకొని మండల పోటీలకు 6, 7తారీఖున నిర్వహించడానికి అందర్నీ హాజరు పరచవలెనని తెలిపారు. ఈ సందర్భంగా మండల యోగ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్ శ్రీనివాస్ మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం కావాలి ఆరోగ్య ఆనంద స్వర్ణాంధ సాకారమే యోగేంద్ర 2025 అంతిమ లక్ష్యం అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పమని వివరించారు. కావున మండలంలోని అన్ని సచివాలయంలో ఉండే యోగా సాధకులు యోగా పోటీలకు సన్నద్ధంగా ఉండి మండల స్థాయి పోటీలకు జిల్లా స్థాయి పోటీలకు రాష్ట్రస్థాయి పోటీలకు పాల్గొనాలని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో యోగా టీచర్లు కోటేశ్వరమ్మ మాస్టర్ ట్రైనర్ వెంకట్ రెడ్డి ఈఓపిఆర్డి వెంకటగిరి రెడ్డి పంచాయతీ సెక్రెటరీ సచివాలయ సిబ్బంది ఆయుష్ సిబ్బంది వెంకటరామయ్య సిబ్బంది పాల్గొన్నారు.




## ఆరోగ్య కేంద్రానికి బెడ్ షీట్లు దిండు కవర్లు విరాళం

**చింతూరు, జూన్ 4 (నిఘా న్యూస్):** చింతూరు ఆరోగ్య సామాజిక కేంద్రంలో బుధవారం జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రోగుల బెడ్ లకు 100 బెడ్ షీట్లు కవర్లు100 పిల్లోకవర్లను ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ ఆసుపత్రి సూపరిండెంట్ కోటిరెడ్డికి విరాళంగా అందజేయడం జరిగింది. రోగులకు బెడ్ షీట్లు పిల్లో కవర్స్ అందుబాటులో సరిపడా లేవని గతంలో జమాల్ ఖాన్ కు కోటిరెడ్డి విన్నవించగా జమాల్ ఖాన్ సానుకూలంగా స్పందించి 100 బెడ్ షీట్ కవర్లు 100పిల్లో కవర్లు తమ ట్రస్ట్ లోగో తో చేయించి అందజేయడం జరిగింది. గతంలో ఆసుపత్రి ఆవరణలో ట్రస్ట్ ద్వారా లక్షా 50 వేల రూపాయల వ్యయంతో త్రాగునీటి బోరును అడిగిన వెంటనే వేయించడం జరిగింది. అడిగిన వెంటనే స్పందించి ఆసుపత్రికి ఉపయోగపడే వాటిని అందజేయడం పట్ల సూపరిండెంట్ కోటిరెడ్డి ఆసుపత్రి సిబ్బంది జమాల్ ఖాన్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి స్టాప్ నర్స్ జెకె సిటీ ట్రస్ట్ సభ్యులు సమీర్ ఎండి జావేద్, ఎస్ కే రసూల్, మండల నాయకులు ఎండి జహంగీర్, మార్కెట్ కమిటీ సభ్యులు పి సాల్మన్ రాజు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో జిహెచ్ఎంసి విఫలం

### గ్రేటర్ కౌన్సిల్ సమావేశంలో ప్రభుత్వ తీరును ఎండగట్టిన కార్పొరేటర్ శ్రీవాణి



**రామంతపూర్, జూన్ 4 (నిఘా న్యూస్):** జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశంలో రామంతపూర్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ బండారు శ్రీవాణి ప్రజా సమస్యలపై గల మెత్తారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. హెచ్ఎం డబ్ల్యూఎస్ అధికారులకు ఎన్ని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని సమస్యలు పరిష్కరణలో పూర్తిగా విఫలమయ్యారని సభ దృష్టికి తీసుకువచ్చారు. కలుషిత మంచినీరు సరఫరా అవుతున్న డ్రైనేజీలు పొంగిపొర్లుతున్న అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని గళ మెత్తారు. ప్రస్తుత వర్షాకాలంలో డ్రైనేజీలు పొంగి పొర్లుతుండడంతో ప్రజలు ఇబ్బందికరంగా మారిన అధికారులు ఏదో ఒకటి సాకు చెబుతూ దాటేస్తుందని తప్ప సమస్యను పరిశీలించటం లేదని కార్పొరేటర్ మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. జలమండలి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన ఏదో ఒకటి చెబుతూ దాటవేస్తున్నారు తప్ప సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

## మృతుడి కుటుంబానికి విద్యుత్ శాఖ నష్టపరిహారం

### నాలుగు లక్షల 50 వేల బాండు బాధిత కుటుంబానికి అందజేత



**రాజేంద్రనగర్, జూన్ 4(నిఘా న్యూస్):** రాజేంద్రనగర్ సబ్ డివిజనల్ పరిధిలో విద్యుత్ షాక్ తో గత సంవత్సరంలో మాలే తిమ్మారెడ్డి అనే కార్మికుడు మరణించడం జరిగింది. తిమ్మారెడ్డి స్వస్థలం మునిమోడం గ్రామం అన్వాడ మండలం, మహబూబ్ నగర్ జిల్లా నుండి, బతుకు దెరువుకోసం, గండిపేట్ మండలం లోని, వెంకటేశ్వర నగర్, గంధంగూడలో ఉంటూ, గత సంవత్సరం కూలి పనికి వెళ్లగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మరణించడం జరిగింది.అతనికి భార్య మాలే సుశీల, ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. గురువారం ప్రభుత్వం నుండి 4లక్షల 50వేల రూపాయలు రాజేంద్రనగర్ సబ్ డివిజనల్, ఏ.డి.ఈ, సత్యనారాయణతో కలసి వనంపల్లి జైపాల్ రెడ్డి బాండు ఇప్పించడం జరిగింది. సందర్భంగా తిమ్మారెడ్డి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేసారు. కార్మికులకు ఎలాంటి ఆపద వచ్చినా ఏఐటీయూసీ అండగా ఉంటుందని, రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈ వృద్ధురాలిని ఆదుకోండి

### ఇందిరమ్మ పథకంలో ఇంటి నిర్మాణానికి సాయ పడండి



**ఇల్లందు, జూన్ 4 (నిఘా న్యూస్):** ఇల్లందు మండలం ఓడ్డుగూడెం గ్రామపంచాయతీ నెహ్రూ నగర్‌కు చెందిన ఈసం చుక్కమ్మ భర్త దూలయ్య స్థానికంగా ఉండే ఇల్లు గడ్డిది కావడంతో గాలి దుమారానికి కోట్టుకపోయి పట్టా కప్పుకొని సగం కూలిన గోడల మధ్య ఉంటున్నామని తెలిపారు. మరల నిర్మించుకోవడానికి ఆర్థిక స్తోమత లేదన్నారు,కంటి చూపు సరిగ్గా లేకపోవడంతో ప్రభుత్వం ఇచ్చే పెన్షన్‌పై ఆధారపడి జీవిస్తున్నామని అన్నారు. అధికారులకు మా ఇల్లు కనిపించక పోవడంతో కంటి చూపు తగ్గిన మేము అధికారులను కలవలేక పోయాం అన్నారు. ప్రభుత్వాలు మారాయి అధికారులు మారారు కాని పేదోని బతుకులు మారే పరిస్థితి లేదన్నారు. భూములు, ఇల్లులు ఉన్నవారికే ఇందిరమ్మ ఇల్లులు మంజూరు చేస్తున్నారని. కనీసం పేదోన్ని కన్నెత్తి చూసే నాధుడే కరువయ్యారంటూ ఆవేదన వ్యక్తపరిచారు.

## తూప్రాన్‌లోని మేడక చెరువు శుద్ధికరణ



**తూప్రాన్, జూన్ 4 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రంలోని మున్సిపల్ ప్రాంతాలను నివాస యోగ్యమైన, స్థిరమైన, పర్యావరణ, అనుకూలత పట్టణాల అభివృద్ధి పరచడం కోసం పట్టణంలో నివసించే ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించే క్రమాన తూప్రాన్ మున్సిపల్ పరిధిలో ఒక్క అడుగు మార్పు కొరకు అనే నినాదంతో జూన్ 2 నుండి సెప్టెంబర్ 10 వరకు 100 రోజుల ప్రత్యేక పారిశుద్ధ్య వివిధ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా, తూప్రాన్ కేంద్రంలోని మేడక చెరువు కట్టను శుద్ధికరణ చేసే పనులను ప్రారంభించారు, మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో మేడక చెరువు కట్ట పైన మొలచిన పిచ్చి మొక్కులను చెత్తా చెదారన్ని, జెసిబి సహాయంతో శుభ్రం చేశారు. ఇందులో మున్సిపల్ శానిటేషన్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## కోడిపందాలపై పోలీసులు దాడి

### కోడి కత్తులు పుంజులు స్వాధీనం



**చింతూరు, జూన్ 4 (నిఘా న్యూస్):** చింతూరు మండలంలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చింతూరు ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో చిడుమూరు– కుంట గ్రామాల మధ్యలో బుధవారం కోడిపందాలు నిర్వహిస్తుండగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 9 మందిపై కేసు నమోదు చేశారు. మూడు కత్తులు, మూడు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. కోడిపుంజుల పందాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసులకు నాలుగు డ్రోన్ కెమెరాల విరాళం

### అల్ట్రాటెక్ సిమెంట్ యాజమాన్యం



**కొలిమిగుండ్ల, జూన్ 4 (నిఘా న్యూస్):** కొలిమిగుండ్ల మండలంలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ కి చెందిన ప్రతినిధులు అంజన్ ప్రకాష్, వంశీకృష్ణ బుధవారం నంద్యాల జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణాను వారు కలిశారు. అనంతరం ఏడు లక్షల రూపాయలు విలువచేసే నాలుగు డ్రోన్ కెమెరాలను జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణాకు అల్ట్రాటెక్ సిమెంట్ ప్రతినిధులు అందజేశారు. ఈ డ్రోన్ కెమెరాల ద్వారా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తోడ్పడతాయని జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా అన్నారు. ఈ కార్యక్రమంలో కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాబు, అల్ట్రాటెక్ సిమెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదులను హతమార్చ లేనోళ్లు...

# ఆదివాసీల ప్రాణాలు తీస్తున్నారు

- కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలకు సిద్ధం కండి
- కుత్బుల్లాపూర్ లో రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ కమిటీ ఏర్పాటు
- సీపీఐ రాష్ట్ర నాలుగవ మహాసభలను జయప్రదం చేయండి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని



**కుత్బుల్లాపూర్, జూన్ 4 (నిఘా న్యూస్):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్‌లో 2025, ఆగస్టు 19–22 వరకు జరగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా షాపూర్ నగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆహ్వాన సంఘ సమావేశానికి సాంబశివరావు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సమావేశం సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల నిర్వహణకు ఆతిధ్యం ఇచ్చిన సీపీఐ మేడ్చల్ జిల్లా సమితికి వారు అభినందనలు తెలిపారు. కుత్బుల్లాపూర్‌లో జరగనున్న రాష్ట్ర మహాసభలకు జాతీయ నేతలు, అన్ని జిల్లాల నుండి దాదాపు 1000మంది పార్టీ ప్రతినిధులు హాజరై, ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై, రాజ్యాంగం కల్పించిన పౌరుల ప్రాథమిక హక్కులపై, చర్చలు జరిపి తీర్మానాల రూపంలో భవిష్యత్ పోరాటాలకు మహాసభ వేదిక కానుందన్నారు. అందుకే రాష్ట్ర మహాసభల విజయవంతానికి ప్రతి కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రజల వద్దకు కరపత్రాలను పంచి, మహాసభల విజయవంతానికి హార్ధిక, ఆర్థిక సహాయ సహకారాలు తీసుకొని, ప్రజలను భాగస్వామ్యం చేయాలని వారు పిలుపునిచ్చారు. అదే విధంగా మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను, అమాయక గిరిజనులను హతమారుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తక్షణమే నిలిపివేయాలని, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, సీజ్ ఫైర్ ను ప్రకటించాలని సీపీఐ డిమాండ్ చేస్తోందన్నారు. కాశ్మీర్ పహల్గాంలో దేశ పౌరులపై నలుగురు ఉగ్రవాదులు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల ఘటనలో 27మందికి పైగా మరణించారని, అయితే కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ నలుగురు ఉగ్రవాదులను పట్టుకోకుండా, దేశంలోని పౌరులు అమాయక ఆధీవాసీలను హననం చేయడం అప్రజాస్వామికమన్నారు.

యుద్ధాన్ని అపానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెబుతున్న మాటలు వింటే, మన దేశ ప్రధాని నరేంద్రమోదీ ట్రంప్‌కు దేశాన్ని తాకట్టు పెట్టారని ఆరోపించారు. భారత దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టిన మోదీకి దేశ ప్రధానిగా కొనసాగే నైతికత లేదని వారు విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ నేత పీజే. చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల నిర్వహణ అంటే పార్టీ నూతనోత్సాహంకు, పార్టీ ఎదుగుదలకు తార్కాణం అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు ఎండీ. యూసుఫ్, సీపీఐ మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ నేత పీజే.చంద్రశేఖర్, ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎం. నర్సింహా, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డీజీ సాయిలు గౌడ్, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఈ. ఉమామహేష్, సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యులు యేసు రత్నం, జీ.దామోదర్ రెడ్డి, జే.లక్ష్మీ, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.లక్ష్మణ్, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.స్వామి, హరినాధ్ రావు, ఎస్.శంకర్ రావు, శంకర్, టి. సత్య ప్రసాద్, కృష్ణ, లతో పాటు సీపీఐ మేడ్చల్ జిల్లా సమితి సభ్యులు దశరథ్, సహదేవ్, శశిదర్ రెడ్డి, సల్మాన్ బేగ్, యాదయ్య, మాధవి, శ్రీనివాస్, లొట్టి ఈశ్వర్, వెంకట్ రెడ్డి, పరమేశ్వర, నాగరాజు, రవి చంద్ర, ప్రమీల, డీజీ. నరేంద్ర ప్రసాద్, నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ సరెండర్

- అక్రమ లే అవుట్లలో నిర్మాణాలకు ఇంటి నంబర్ల కేటాయింపు
- అనుమతులు లేకుండా మున్సిపల్ సిబ్బందిని దైవ దర్శనానికి తీసుకెళ్లిన కమిషనర్ చౌహాన్
- సంగారెడ్డి నూతన కమిషనర్‌గా శ్రీనివాస్ రెడ్డి



**సంగారెడ్డి, మే 4 (నిఘా న్యూస్):** ఉన్నతాధికారుల అనుమతి లేకుండా మున్సిపల్ సిబ్బందిని దైవ దర్శనానికి తీసుకెళ్లిన సంఘటన సంగారెడ్డి జిల్లా కేంద్రంలో కలకలం రేపింది. ఈ ఘటనపై సీరియస్ అయిన కలెక్టర్ వల్లూరు క్రాంతి, సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌ను బుధవారం బాధ్యతల నుంచి తప్పించారు. ఆయనను అధికారికంగా సరెండర్ చేయించారు. ఇతను బాధ్యత చేపట్టిన నాటి నుంచి అనేక అవినీతి ఆరోపనలు ఎదుకొట్టన్నారు. అక్రమ లేవుట్ ఒకే సారి 26 ఇండ్లకు అనుమతులు మంజూరు చేసి లక్షల్లో అవినీతి సొమ్ము నొక్కేసారనీ ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనల నేపథ్యంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో విచారణ చేపింపగా, ఆరోపణలు నిజమేనని తేలింది. బైపాస్ రోడ్డులో ఓ వెంచర్ యజమాని అక్రమ లేవుట్ చేసి వాటికి ఇంటి నెంబర్లు కేటాయించట. ఓ వాటి పై విచారణ చేపట్టి సరైయిన రిపోర్ట్ ఇవ్వటంలో విఫలం అయ్యారని వాదలు అధికంగా ఉన్నాయి. మున్సిపాలిటీలో సెల్లార్ అనుమతులు లేకున్నా వాటిని నిర్మాణం చేస్తున్నా సిబ్బందికి సరైన సూచనలు చేయటం లేదనే వాదనతో పాటు పలు ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. ఉన్నాత స్థాయి అధికారులు పర్యవేక్షణ లేకుండా సిబ్బందిని తీసుకెళ్లడాన్ని నిబంధనల ఉల్లంఘనగా గుర్తించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రసాద్ చౌహాన్ స్థానంలో దుబ్బాక మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. అధికారికంగా ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ సంఘటనపై స్థానిక పరిపాలన వర్గాల్లో చర్చ నడుస్తోంది. అధికార ధర్యాప్తులో తప్పిదాలు తేలిన నేపథ్యంలో సంబంధిత అధికారుల తీరుపై పాలక మండలిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిబంధనలను అగౌరవపరచిన అధికారులపై చర్యలు తప్పవని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు.

## విద్యను వ్యాపారం చేసిన ప్రైవేటు పాఠశాలలు

- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని విద్యాశాఖ
- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు




**భువనగిరి, జూన్ 4 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు పాల్గొని మాట్లాడుతూ వలిగొండ మండల కేంద్రంలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో మీ పిల్లల్ని చేర్చి మోసపోవద్దని కోరారు. గతంలో హడావుడిగా ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాల ప్రారంభించి వందల సంఖ్యలో అడ్మిషన్లు తీసుకొని పేద మధ్యతరగతి తల్లిదండ్రులను మోసం చేసిన పరిస్థితి ఉందన్నారు. ఈ సంవత్సరం ఎలాంటి పర్మిషన్ లేకుండా బహిరంగంగా ఎలాంటి అనుమతులు లేకుండా అడ్మిషన్ వర్క్ ప్రారంభించి అడ్మిషన్లు తీసుకుంటున్నా జిల్లా విద్యాధికారి స్పందించడం లేదన్నారు. గతంలో ఉన్న జిల్లా విద్యాధికారి శ్రీ చైతన్య కార్పొరేట్ పాఠశాలపై కేసు నమోదు చేసి ఆ పాఠశాలను సీజ్ చేయడం జరిగింది అన్నారు. ప్రస్తుతం ఉన్న జిల్లా విద్యాధికారి వచ్చిన తర్వాత చైతన్య పాఠశాలపై ఎస్ఎఫ్ఐగా ఫిర్యాదు చేసిన వెంటనే చర్యలు తీసుకుంటామని మాటలు చెప్పి దాటీవేస్తున్న పరిస్థితి ఉంది అన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి జిల్లా విద్యాధికారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వలిగొండ మండలంలో ఉన్న చైతన్య పాఠశాలలతో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు ఒకవైపు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బడుల ద్వారా పేద మధ్య తరగతుల విద్యార్థులను అభివృద్ధి చేస్తాం అని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం చెప్తా ఉంటే మరోవైపు బడిబాట ద్వారా ఉపాధ్యాయులు అడ్మిషన్ వర్క్ చేస్తా ఉంటే జిల్లా విద్యాధికారి ప్రైవేటు పాఠశాలల తొత్తుగా మారడం సిగ్గుచేటు అన్నారు. వెంటనే జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎస్ఎఫ్ఐ గా జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలో ఉద్యమాలు నిర్వహించి శ్రీ చైతన్య పాఠశాలతో పాటు జిల్లా వ్యాప్తంగా అనుమతులు పాఠశాలలు చర్యలు వరకు పోరాటాల నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దళితుల సమాధులు నేలమట్టం

### నాగయ్య పల్లెలో స్మశానవాటిక స్థలం కబ్జా

### జాతీయ రహదారిపై దళితుల ధర్నా

### ప్రజా సంఘాల జేపీసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్



**హనుమకొండ/ఆత్మకూర్, జూన్ 4 (నిఘా న్యూస్):** మండలంలోని నాగయ్య పల్లెలో కొంతమంది అగ్ర కులస్తులు భూ కబ్జాదారులుగా అవతారమెత్తి రెచ్చిపోయారు. ఏకంగా ఎస్సీల స్మశాన వాటికనే కబ్జా చేశారు.సర్వే నెంబర్ 931లో దాదాపు రెండు ఎకరాల భూమిలో ఆది నుంచి గ్రామంలోని మాదిగ కులస్తులు స్మశాన వాటికగా ఏర్పాటు చేసుకొని సమాధులు నిర్మించారు.ఈ భూమిపై కన్నేసిన గ్రామానికి చెందిన పోగుల మహేందర్ రెడ్డి,పోగుల బ్రహ్మయ్య,పోగుల కైలాసం,పోగుల సురేందర్ అను వ్యక్తులు మంగళవారం జెసిబిలను తీసుకువచ్చి సమాధులను తొలగించి స్మశానవాటిక లోకి అక్రమంగా ప్రవేశించి భూమిని చదును చేశారు. దీనిపై పోలీసు అధికారులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో ప్రజాసంఘాల జేపీసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు బుధవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాతో సుమారు రెండు కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ స్తంభించింది.ఈ సందర్భంగా ప్రజా సంఘాల జేపీసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ మాట్లాడుతూ కఠిన చర్యలు తీసుకొని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సై తిరుపతి సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకాలను శాంతింపజేసి కబ్జాదాలపై చర్య తీసుకుంటామని హామీ ఇచ్చి ధర్నాను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ దళిత ప్రజాసంఘాల నాయకులు బాగాజీ రజనీకాంత్, జినుక అశోక్, మాదాసి ప్రభాకర్, మాదాసి ఎర్ర సూరయ్య, మాదాసి కృష్ణ, మాదాసి సాంబయ్య, మాదాసి సుధాకర్, సంగి యాకయ్య, గిన్నారపు భాస్కర్, మాదాసిరాజు, మాదాసి మల్లయ్య, మాదాసి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

### జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శ్రీధర్



**హైదరాబాద్, జూన్ 4 (నిఘా న్యూస్):** చిన్నారులకు ఇవ్వవలసిన వ్యాధి నిరోధక టీకాలు జాబితా ప్రకారం సమయానుసారంగా క్రమం తప్పకుండా ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ శ్రీధర్ ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. పర్యవేక్షణలో భాగంగా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శ్రీధర్ లాలపేట క్లస్టర్ పరిధిలోని గరీబ్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, బైబిల్ హౌస్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రంగనగరంలోని అంగన్వాడి కేంద్రాన్ని పర్యటించి ఇమ్యునైజేషన్‌లో భాగంగా వ్యాక్సినేషన్ ఇచ్చు కార్యక్రమాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన చిన్నారులకు అందరికీ వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి ఇవ్వాలని సూచించడం జరిగిందని పేర్కొన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు సైతం ప్రతి బుధవారం ప్రతి శనివారం వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వడంతోనే చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కోల్డ్ చైన్ టెక్నీషియన్ శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

## తిరుపతిలో వైసిపి నేతల..

# భారీ నిరసన ర్యాలీ

- పండగ కాదు ఈ ప్రభుత్వం సుద్ద దండగ
- హాజరైన ఎంపీలు మిథున్ రెడ్డి, మద్దిల గురుమూర్తి





**తిరుపతి, జూన్ 4(నిఘా న్యూస్):** కూటమి ప్రభుత్వం మోస పూరిత హామీలను నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశాలతో సర్వేపల్లి నియోజకవర్గం, వెంకటాచలం మండల కేంద్రంలో నిర్వహించిన వెన్నుపోటు దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎంపీ, మిథున్ రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కుమార్తె కాకాణి పూజితతో కలిసి తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటాచలం సర్వేపల్లి రోడ్డు నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమ అనంతరం ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ ప్రజలకు మోస పూరిత హామీలు ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఈరోజు ప్రజలకు పండగ దినమని కూటమి నాయకులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ఏద్దేవా చేశారు. ఇది పండగ చేసే ప్రభుత్వం కాదని సుద్ద దండగ ప్రభుత్వం అని ప్రజలు అనుకొంటున్నారని ఎంపీ అన్నారు. కూటమి ఇచ్చిన మోసపూరిత హామీలు రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వాన్ని దావానంలా దహిస్తాయని పేర్కొన్నారు. ఎన్నికల హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు అక్రమ కేసులతో వైసీపీ కార్యకర్తలని, నాయకులని వేదిస్తున్నారని, ఇలాంటి ఉడత ఊపులకు భయపడే ప్రసక్తే లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో ప్రభుత్వ వైఫల్యాలపై ఇలాంటి నిరసన కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com